విశాలాంధ్ర

ప్రకాశం

బాపట్ల

బుధవారం 27 మార్చి 2024

8 పేజీలు

ఎన్నికలపై ప్రత్యేక నిఘా

- చెక్‌పోస్టులు ఏర్పాటు
- టోల్‌గేట్ వద్ద ప్రత్యేక బృందాలు
- నగదు, మద్యం బదిలీలపై ప్రత్యేక దృష్టి
- ఎన్నికల నియామావళి అమలుకు ప్రత్యేక బృందాలు
- రాజకీయ నాయకుల విగ్రహాలు, శిలాఫలకాలకు ముసుగులు
- ఎన్నికల అమలుకు అధికారుల ముమ్మర ఏర్పాట్లు

తర్లుపాడు రైల్వేస్టేషన్ వద్ద కారును తనిఖీ చేస్తున్న స్క్వాడ్

విశాలాంధ్ర బ్యూరో-ఒంగోలు :

సార్వత్రిక ఎన్నికల నిర్వహణపై అటు అధికారులు ఇటు పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. ఎన్నికల నియమావళి అమలుపై ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఇప్పటికే పోలీసుశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక చెక్‌పోస్టులను ఏర్పాటు చేయగా నేషనల్ రహదారులపై ఉన్న టోల్‌గేట్‌ల వద్ద ప్రత్యేక బృందాలు వాహనాలను తనిఖీ చేస్తున్నాయి. మరోపక్క మద్యం, డబ్బు తరలింపుపై ప్రత్యేక దృష్టి సారించారు. ఇప్పటికే జిల్లాలో లక్షల రూపాయల డబ్బులు, మద్యం సీసాలను పోలీసు బృందాలు పట్టుకున్నాయి. మరోపక్క ఎన్నికల ఏర్పాట్లపై కలెక్టర్ ఈవీఎంల ఏర్పాటు, ఎన్నికల నిర్వహణపై అధికారులు విధి విధానాలపై నిత్యం సమీక్షలతో బిజీలయ్యారు. ఎక్కడికక్కడ ఎన్నికల నియమావళి అమలుపై అటు అధికారులు ఇటు పోలీసులు కలిసి ముందుకు సాగుతున్నారు. ఎన్నికల షెడ్యుల్ నుండి ఎన్నికల పోలింగ్ వరకు సమయం ఎక్కువగా ఉండటంతో అభ్యర్థులు కూడా ఎన్నికల ప్రచారంలో దామ దాన దండోపాయాలు ఉపయోగిస్తున్నారు. మొత్తానికి ఈసారి ఎన్నికలు పోటీలో ఉన్న అధికార ప్రతిపక్ష పార్టీలకు ప్రతిష్టాత్మకంగా మారాయి. ఈ ఎన్నికల్లో బరిలో ఉన్న అభ్యర్థులు గెలుపే లక్ష్యంగా కోట్ల రూపాయలు ఖర్చు చేసేందుకు కూడా వెనుకాడటం లేదు. ఇప్పటికే ఆ పార్టీలోని చోటా మోటా నాయకులతో పాటు వలస వస్తున్న వారికి లక్షల రూపాయలు మిగతా 2 లో ...

అతివలకేది ఆసరా...?

- బటన్ నొక్కి రెండు నెలలైనా జమకాని సొమ్ములు

విశాలాంధ్ర-కనిగిరి : డ్వాక్రా సంఘాల్లోని అక్క చెల్లెమ్మల బ్యాంకు ఖాతాలకు ఆసరా నగదు జమ చేస్తున్నామని ఈ ఏడాది జనవరి 23వ తేదీన అనంతపురం జిల్లా ఉరవకొండలో వైయస్సార్ ఆసరా నిధులకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి బటన్ నొక్కారు. కార్యక్రమం జరిగి రెండు నెలలు అవుతున్నా చాలా సంఘాలకు నేటికీ డబ్బులు జమ కాకపోవటం గమనార్హం. స్వయం సహాయక సంఘాల మహిళలు బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ అలసిపోతున్నారు. జిల్లాలో గ్రామీణ అభివృద్ధి డిఆర్డిఏ సంస్థ, పట్టణ పేదరికం నిర్మూలన సంస్థల కింద సుమారు 36,789 స్వయం సహాయక సంఘాలకు నాలుగో విడత ఆసరా నగదు రూ. 280.10 కోట్లు 3,59,566 మంది మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం వారి ఖాతాల్లో జమ చేసింది.

రెండేళ్లుగా ఆలస్యం : వైకాపా ప్రభుత్వం తొలినాళ్లల్లో నేరుగా లబ్ధిదారుల ఖాతాలకు నిధులు జమ చేసేది. గత ఏడాది కూడా ఆలస్యమైంది. ఈ ఎడాది ఎన్నికల సమయం కావడంతో వెంటనే డబ్బులు పడతాయని స్వయం సహాయక సంఘాల మహిళలు భావించారు. నాలుగో విడత సహాయం రెండు మాసాలు దాటిపోయిన జమ కాలేదు. కొద్దిమందికి ఆసరా నిధులు జమైనట్లు తెలిసిన మిగతా 2 లో ...

బాపట్లలో ప్రబలిన డయేరియా

- మంచం పట్టిన తూర్పు పినిబోయినవారి పాలెం
- వాంతులు, విరోచనాలతో ఆసుపత్రుల్లో 50 మంది చికిత్స
- తూతూమంత్రంగా వైద్యఆరోగ్య శాఖ పనితీరు

విశాలాంధ్ర - బాపట్ల :

బాపట్ల మండలం తూర్పు పిన్నిబోయినవారి పాలెం గ్రామంలో డయేరియా ప్రబలటంతో గ్రామస్తులు మంచం పట్టారు. తీవ్రమైన వాంతులు, విరోచనాలతో నీరసం చెంది ఆసుపత్రుల వైపు పరుగులు తీస్తున్నారు. ఒకరి వెంట ఒకరికి డయేరియా వ్యాపించటంతో ఏం చేయాలో కారణం తెలియక ఎవరికి చెప్పుకోవాలని అర్ధంకాక దేవుడా అంటూ బాధితులు ఆందోళన చెందుతున్నారు. గ్రామస్తులు గత ఐదు రోజుల నుంచి డయోరియా భారిన పడి బాపట్ల, కర్లపాలెం, గుంటూరు, చీరాల ఆసుపత్రులలో చికిత్స తీసుకుంటున్నారు. ఈ ఘటన బాపట్ల నియోజకవర్గంలో తీవ్ర భయాందోళనకు గురిచేస్తుంది.

- వాతావరణంలో మార్పులు చోటుచేసుకోవటం గ్రామంలో వేసవికి అడుగంటటం ఒక కారణంగా గ్రామస్తులు అభిప్రాయపడుతున్నారు. మరోవైపు గ్రామంలో తాగునీటి కొరత ఏర్పడటం వలన ఉప్పు నీటి సాంద్రత కలిగిన నీరు తాగటం వలన డయేరియాకు గురైనట్లు గ్రామంలో చర్చించుకుంటున్నారు. సరఫరా అయే తాగునీరు సక్రమంగా లేకపోవటం వలనే ప్రధాన కారణంగా అభిప్రాయపడుతున్నారు.

- వైద్య ఆరోగ్య సిబ్బంది తీవ్ర నిర్లక్ష్య వహించటంతో గ్రామంలో అధిక సంఖ్యలో ప్రజలు డయేరియా భారిన పడ్డారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత వారం రోజుల నుంచి డయేరియాతో గ్రామస్తులు బాధపడుతూ ఉంటే కేవలం ఒకరు ఇద్దరు సిబ్బంది మిగతా 2 లో ...

'ఆమంచి' దారెటు..

- చీరాలపై వీడని మక్కువ
- భాజపాలో చేరికపై ఊహాగానాలు

విశాలాంధ్ర - చీరాల రూరల్ :

ఆమంచి కృష్ణమోహన్ పరిచయం అవసరం లేని పేరు. మాజీ ముఖ్యమంత్రులు వైఎస్ రాజశేఖర రెడ్డి ఆశీస్సులతో కొణిజేటి రోశయ్య అండతో రాజకీయాల్లో చక్రం తిప్పిన నేత.చీరాల శాసనసభ నియోజకవర్గాన్ని అడ్డాగా చేసుకుని రాజకీయాన్ని తన వైపు తిప్పుకుని నడిపిన ఘనత ఆయన సొంతం. జడ్పీటీసీగా, ఎంపీపీగా, ఎమ్మెల్యేగా ప్రజలకు సేవలు అందించి రాజకీయాల్లో నూతన ఒరవడిని సృష్టించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేగా, విభజిత ఆంధ్రప్రదేశ్‌లో 2014లో నవోదయ పార్టీ తరపున శాసన సభ్యునిగా ఎన్నికయ్యారు. అప్పటి అధికారంలో ఉన్న తెలుగుదేశం పార్టీకి మద్దతుగా నిలిచారు. 2019 ఎన్నికలలో వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి జై కొట్టి వైకాపా చీరాల నియోజకవర్గ అభ్యర్థిగా పోటీ చేసి తెలుగు దేశం పార్టీ అభ్యర్థి కరణం బలరామ కృష్ణమూర్తి చేతిలో ఓటమి పాలయ్యారు. అయినప్పటికీ చీరాల నియోజకవర్గ వైకాపా సమన్వయకర్తగా పని చేసి పార్టీ,ప్రభుత్వ బాధ్యతలను సక్రమంగా అమలు చేశారు.తదనంతర రాజకీయ పరిణామాల మధ్య చీరాలకు కూతవేటు దూరంలో ఉన్న పర్చూరు నియోజకవర్గం వైకాపా సమన్వయకర్తగా నియమింపబడ్డారు. పర్చూరు నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో అనుచర గణాన్ని సంపాయించుకున్నారు.చీరాల నియోజకవర్గంపై మక్కువతో చీరాలలో పోటీ చేయాలని ఆశపడ్డారు. చీరాల నియోజకవర్గంలోని అనుచర గణంతో సమావేశాలు నిర్వహించడంతో పాటు, చీరాల నుండి పోటీ చేయబోతున్నట్లు సంకేతాలు ఇచ్చి అనుచరగణంలో ఉత్సాహం నింపారు.కానీ తాను ఒకటి తలిస్తే భగవంతుడు ఇంకోటి తలచినట్లు వైకాపా ప్రకటించిన జాబితాలో ఎక్కడా ఆమంచి కృష్ణమోహన్‌కు చోటు లేకుండా పోయింది.చీరాల,పర్చూరు నియోజకవర్గాలలో అధికార వైకాపా,ప్రతిపక్ష తెదేపా అభ్యర్థులను ప్రకటించాయి.దీనితో ఆమంచి భవితవ్యం ఏమిటో అర్థం కాక అనుచర గణం సందిగ్ధంలో పడ్డారు.ప్రతి చోట సభలు, సమావేశాలు నిర్వహించి వైకాపా అధినేత జగన్ మోహన్ రెడ్డి చీరాల నియోజకవర్గంపై పునరాలోచన చేసి అభ్యర్థిగా కృష్ణమోహన్‌ను ప్రకటించాలని డిమాండ్ చేస్తున్నారు.ప్రధాన పార్టీలు బీఫారం ఇచ్చేనాటికి ఆమంచిని దృష్టిలో పెట్టుకునే వ్యవహరిస్తాయని లేకుంటే ఇండిపెండెంట్‌గా అయినా ఎన్నికలలో పోటీ చేసి చీరాల నియోజకవర్గంలో సత్తా చాటుతారని భావిస్తున్నారు. లేకపోతే తనకు సన్నిహిత మిగతా 2 లో ...

బాపట్లలో ప్రబలిన డయేరియా

(మొదటిపేజీ తరువాయి)

మాత్రమే గ్రామంలోకి వెళ్లి నాలుగు మందు బిళ్లలు ఇవ్వటం వైద్య ఆరోగ్య శాఖ నిర్లక్ష్యం కనపడుతుంది. అధికార యంత్రంగా నిర్లిప్తంగా వ్యవహరించటం వలన అధిక సంఖ్యలో ప్రజలు డయేరియాతో ఆసుపత్రికి వెళ్లే పరిస్థితి ఏర్పడిందన్నారు. కొంతమంది గ్రామంలో ఇంటి వద్దే చికిత్స తీసుకుంటున్న పరిస్థితి నెలకొంది. స్థానికంగా సరైన వైద్యం అందకపోటంతో ప్రభుత్వ వైద్యులు సక్రమంగా లేకపోవటంతో బాధితులు ప్రవేటు ఆసుపత్రుల వైపు పరుగులు తీస్తున్నారు.

– ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి గ్రామంలో డయేరియా ప్రబలటానికి తాగునీరు కలుషితమా పరిసరాల అపరిశుభ్రత అనే అంశంపై దృష్టి సారించాల్సిన అవశ్యకత ఎంతైన ఉంది. బాధితులకు సత్వరమే పూర్తిస్థాయి వైద్య సేవలు అందించాల్సిన అవశ్యకత ఎంతైన ఉంది. ప్రభుత్వ వైద్య సేవలపై బాధితులకు భరోసా కల్పించే విధంగా వైద్యశాఖ అధికారులు చిత్తశుద్ధితో ప్రజలకు వైద్య సేవలు అందించి భరోసా కల్పించాలని పలువురు కోరుతున్నారు.

– డయేరియా మాత్రమే ఆసుపత్రిలో ఏడుగురు మాత్రమే చికిత్స తీసుకుంటున్నట్లు అప్పికట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు ఉస్మాన్ తెలిపారు. గ్రామంలో పర్యటన చేశామని అవసరమైన వారికి ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేస్తున్నామన్నారు. గ్రామంలో ముగ్గురికి సెలైన్ ద్వారా చికిత్స అందిస్తున్నామన్నారు. ఎవరికైన సమస్య ఉంటే మందు బిళ్లలు తీసుకువెళ్లాలని డాక్టర్ తెలిపారు.

అతివలకేది ఆసరా..?

(మొదటిపేజీ తరువాయి)

సమాచారం. జిల్లా వ్యాప్తంగా 3,59,566 మంది మహిళలకు ఆసరా నిధులు మంజూరు చేసిన 25 శాతం మందికే నిజమైనట్లు మిగతా 75 శాతం మంది మహిళలకు జమ కాకపోవటంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి స్వయం సహాయక సంఘాలకు రావలసిన ఆసరా నిధులు జమ అయ్యేలాగా చొరవ చూపాలని మహిళలు కోరుతున్నారు.

ఎన్నికలపై ప్రత్యేక నిఘా

(మొదటిపేజీ తరువాయి)

ముట్ట చెబుతుండగా ఎన్నికల సమయానికి ఓటర్లకు రెండు వేల నుంచి ఐదు వేల వరకు పంపిణీ చేసేందుకు సిద్ధమయ్యారు. మరోపక్క మద్యం ఏరులై పారించేందుకు కూడా స్టాక్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మద్యం, డబ్బు నియంత్రణపై అధికారులు, పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. మరోపక్క గత ఎన్నికల్లో గుర్తించిన సమస్యాత్మక గ్రామాలపై కూడా పోలీసులు నిఘా ఉంచారు. జిల్లాలో ఉన్న రౌడీషీటర్లను బైండోవర్ చేసుకున్నారు. సమస్యాత్మక కేంద్రాల్లో ఇప్పటికే పోలీసులు కవాతు నిర్వహించారు. మొత్తం మీద ఎన్నికల నిర్వహణపై అధికార యంత్రాంగం ప్రత్యేక నిఘా ఉంచింది.

'ఆమంచి' దారెటు..

(మొదటిపేజీ తరువాయి)

మిత్రులైన దగ్గుబాటి వెంకటేశ్వర రావు సతీమణి పురంధేశ్వరి అధ్యక్షురాలిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న భారతీయ జనతా పార్టీలో చేరి రాజకీయాల్లో తన ప్రభావాన్ని చూపిస్తారని ప్రజలు ఊహాగానాలు చేస్తున్నారు. మరి ఆమంచి కృష్ణమోహన్ దారెటో మరి కొద్ది కాలంలో తేలనున్నది. అప్పటివరకు అనుచరులకు నిరీక్షణ తప్పదేమో వేచి చూడాలి.

వివాహ వేడుకల్లో ముత్తుముల



విశాలాంధ్ర-గిద్దలూరు : పట్టణంలోని నంద్యాల రోడ్డులోని శ్రీ చీతిరాల కళ్యాణ మండపంలో పట్టణానికి చెందిన రాచర్ల మహేశ్వరరావు శ్రీమతి సావిత్రిల కుమారుడు మణికంఠం, హర్షల వివాహ రిసెప్షన్ కార్యక్రమంలో గిద్దలూరు టిడిపి ఇన్చార్జ్ ముత్తుముల అశోక్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాపు సంఘం నాయకులు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థులను బలపరచాలి

విశాలాంధ్ర – చీరాలరూరల్ : మండలంలోని ఈపురుపాలెం గ్రామ పంచాయతీ తెలుగుదేశం పార్టీ ఆత్మీయ సమావేశంలో నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అభ్యర్థి మద్దులూరి మాలకొండయ్య పాల్గొన్నారు. కొండయ్య మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీని పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికలలో ఆదరించాలన్నారు. ఎన్నికలలో పోటీ చేస్తున్న తెదేపా, భాజపా, జనసేన కూటమి అభ్యర్థులైన టి.కృష్ణ ప్రసాద్‌ను, తనను బలపరచాలని కోరారు. ఈ కార్యక్రమంలో గుర్రం వెంకటేశ్వర్లు, అందే ఉమామహేశ్వరావు, గుద్దంటి చంద్రమౌళి, అవ్వారు సాంబయ్య, సంబారు నరసింహారావు, సయ్యద్ ముంతాజ్, ఆకురాతి ఏడుకొండలు, విన్నకోట జగదీష్, గంజి పురుషోత్తం, నందం లావణ్య, సాధు లక్ష్మయ్య, పడవల లలిత, ఎన్.వీ రమణారావు, కొతరపు జనార్ధనరావు, స్థానిక నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బీసీ డిక్లరేషన్‌పై అవగాహన

చీరాల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బీసీ డిక్లరేషన్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యువనాయకులు గౌరీ అమర్నాథ్ మాట్లాడుతూ బీసీ డిక్లరేషన్‌లో చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన పథకాలను గురించి అవగాహన కల్పించారు. బీసీ డిక్లరేషన్‌లో ప్రవేశపెట్టిన అన్ని పథకాలను, హామీలను ఇంటింటికి తిరిగి ప్రచారం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కొతరపు జనార్దన్ రావు, గజవల్లి శ్రీనివాసరావు, అంగిరేకుల వెంకటేశ్వర్‌రావు, గుమ్మ వెంకటేష్, యూనిట్ ఇంఛార్జిలు, బూత్ కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

కేసు నమోదులో ఎటువంటి రాజకీయం లేదు

దర్శి సీఐ సమీముల్లా

విశాలాంధ్ర-దర్శి : దర్శి సర్కిల్ ముండ్లమూరు స్టేషన్ పరిధిలో జరిగిన ట్రాక్టర్ ప్రమాదంలో పోలీసులు సకాలంలో స్పందించి కేసు నమోదు చేశారని ఎటువంటి రాజకీయ ప్రమేయం లేదని దర్శి సర్కిల్ ఇన్స్పెక్టర్ సమీముల్లా విలేకరుల సమావేశంలో వెల్లడించారు. కేసు వివరాలను వెల్లడిస్తూ బిజ్జం శ్రీనివాస్‌రెడ్డి ట్రాక్టర్ ప్రమాదంలో గాయపడ్డ నాగభూషణం మధ్య ఒప్పందం కుదుర్చుకున్నారని నాగభూషణానికి అయ్యే వైద్య ఖర్చులు బిజ్జం శ్రీనివాస్‌రెడ్డి ఇచ్చే విధంగా పెద్ద మనుషుల సమక్షంలో ఒప్పందం కుదుర్చుకొని 60 వేల రూపాయలు ఇవ్వడం జరిగిందని చికిత్స పొందుతూ నాగభూషణం ఒప్పందం మేరకు ఇవ్వవలసిన నగదు ఇవ్వకపోవడంతో ఫిర్యాదు చేయడం జరిగిందని ఆమేరకు కేసు నమోదు చేశారని చెప్పారు. బిజ్జం శ్రీనివాస్ రెడ్డి ద్విచక్ర వాహనాన్ని నాగభూషణం వద్ద ఉండడంతో ముణ్ళమూరు స్టేషన్లో ఎస్సైని ఇప్పించాలని కోరగా నాగభూషణనికి చెప్పడం జరిగిందని తిరిగి ఇరువురి మధ్య మరోమారు గొడవ జరగడంతో నాగభూషణం ఎస్సీ కేసు నమోదు చెయ్యాలని పోలీసులను ఆశ్రయించారు. ఉన్నతాధికారి ఆదేశాల మేరకు కేసు నమోదు చేయడం జరిగిందని చెప్పారు. ఈ కేసు నమోదు ఎటువంటి రాజకీయ కోణంలేదని అన్నారు. బిజ్జం శ్రీనివాస్ రెడ్డి ఇచ్చినా పిర్యాదు పై కేసు నమోదు చేయాలదని ఒక ప్రముఖ పత్రికలో రావడం వాస్తవం లేదని సీఐ సమీముల్లా అన్నారు. కేసు నమోదు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముండ్లమూరు ఎస్సై ఆంజనేయులు పాల్గొన్నారు.

ముత్తుముల సమక్షంలో టీడీపీలో చేరికలు

విశాలాంధ్ర-గిద్దలూరు : పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి సమక్షంలో మండలంలోని నరవ గ్రామపంచాయతీ పరిధిలోని ఎన్ బయనపల్లె గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ సభ్యుడు మీసాల పాపయ్య యాదవ్ ఆధ్వర్యంలో మంగళవారం గ్రామంలోని 40 కుటుంబాలు వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా అశోక్ రెడ్డి టీడీపీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. గ్రామాల్లో అభివృద్ధి జరగాలంటే తెలుగుదేశంతోనే సాధ్యమని, రాబోయే ఎన్నికల్లో నియోజక వర్గాన్ని అభివృద్ధి చేసిన అశోక్ రెడ్డి గెలుపు కోసం కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపిని వీడి టీడీపీలో చేరిన వారిలో నరవ – బయనపల్లె గ్రామానికి చెందిన రమేష్, వెలిదేండ్ల బాల రంగారెడ్డి, బోయిల్ల పొలిరెడ్డి, చింతకుంట్ల పిరయ్య, వీరమాసి భాస్కర్, దిబ్బగార్ల కాశన్న, కొలురి పెద్దకాశన్న, దుగ్గేపోగు చిన్న రంగయ్య, కోవెలకుంట్ల జమాలయ్య, బండెల రాజబాబు, బాబు, వీరమాసి పెద్ద భాస్కర్, దుగ్గేపోగు దావేద్, బుజ్జి, దానం, లక్ష్మయ్య, అమడాల వసంత్, పోలిరెడ్డి, నరసింహులు, మస్తానయ్య, రంగ నాయకులు, శివకిశోర్, రవికృష్ణ, శివ, చంద్రమౌళి, మీసాల రాజగోపాల్, మండేన్న, మస్తానయ్య, పెద్ద జమాలయ్య, కోవెలకుంట్ల బాబాయి, చాంద్పాషా, వై.సాయి, గుళ్లకుంట్ల మస్తాన్ తదితరులు పాటలు ఉన్నారు పార్టీలో చేరారు కార్యక్రమంలో జడ్పిటిసి బుడతా మధుసూదన్ యాదవ్, మండల టిడిపి అధ్యక్షులు మార్తాల సుబ్బారెడ్డి, టిడిపి నాయకులు చేరెడ్డి జయరాంరెడ్డి, నారాయణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

దద్దాల, చెవిరెడ్డిలను అత్యధిక మెజార్టీతో గెలిపించాలి

జడ్పీటీసీ కస్తూరి రెడ్డి, ఎంపీపీ ప్రకాశం

విశాలాంధ్ర-కనిగిరి : కనిగిరి వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి దద్దాల నారాయణ యాదవ్, ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని అత్యధిక మెజార్టీతో ప్రజలందరూ గెలిపించాలని కనిగిరి జెడ్పిటిసి మడతల కస్తూరి రెడ్డి, ఎంపీపీ దంతులూరి ప్రకాశం పిలుపునిచ్చారు. మంగళవారం కనిగిరి మండలం వంగపాడు, ఎగవపల్లి గ్రామపంచాయతీలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కనిగిరి నియోజకవర్గంలో పాటు జిల్లా అభివృద్ధి చెందాలంటే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తోనే ప్రజా సంక్షేమ పాలనను అందిస్తున్న జగన్మోహన్ రెడ్డిని మరోసారి సీఎం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి, గ్రామ సర్పంచ్ రావులపల్లి తిరుపతి నాయుడు, ఎంపీటీసీ హాజరతమ్మ, పోలక సిద్దారెడ్డి రామసుబ్బారెడ్డి, గుడిపాడు సర్పంచ్ నాగేంద్ర రెడ్డి, సేవాదళ్ శ్రీ హరి రెడ్డి నియోజకవర్గం యూవ నాయకులు సంగటి మహేంద్ర రెడ్డి, కృష్ణ పురం సర్పంచ్ నరాల వెంకట రెడ్డి, మానేపల్లి పెతారు, మస్తాన్, చల్లగాలి గురుస్వామి, పోలక మాలకొండయ్య, గురవాజీపేట సర్పంచ్ రవి, వెంకటేశ్వర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

మాగుంట, దామచర్లను కలిసిన ఆకుపాటి

విశాలాంధ్ర-పామూరు : ఒంగోలు పార్లమెంటు తెలుగుదేశం పార్టీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులురెడ్డిని ఆయన క్యాంపు కార్యాలయంలో యువ నాయకులు, పామూరు పట్టణ రెండో ఎంపీటీసీ ఆకుపాటి వెంకటేష్ మంగళవారం మర్యాదపూర్వకముగా కలిశారు. రాజకీయ పరిణామాలపై ముచ్చటించారు. శ్రీనివాస్‌రెడ్డిని పుష్పగుచ్ఛంతో అభినందించి దుశ్శాలువాతో వెంకటేష్ సత్కరించారు. అనంతరం ఒంగోలు టిడిపి అభ్యర్థి దామచర్ల జనార్దన్, జనసేన జిల్లా అధ్యక్షులు షేక్ రియాజ్‌లను ఆకుపాటి వెంకటేష్ మర్యాదపూర్వకముగా కలిసి పుష్పగుచ్ఛంతో అభినందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు మాజీ ఏఎంసీ చైర్మన్ ఘనశ్యామ్, ప్రకాశం జిల్లా మాజీ పశుసంవర్ధక శాఖ చైర్ పర్సన్ రంగసాయి, జనసేన కార్పొరేటర్ రమేష్, పలువురు ఆకుపాటి మిత్రులు పాల్గొన్నారు.

ఎన్నికల విధులు సక్రమంగా నిర్వర్తించాలి

విశాలాంధ్ర-ముండ్లమూరు : ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున మండల స్థాయి అధికారులు ఎన్నికల విధులు సక్రమంగా నిర్వర్తించాలని దర్శి నియోజకవర్గ ఎన్నికల అధికారి ఎంపీఎస్ లోకేశ్వరరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశపు హాలులో మంగళవారం పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, మహిళా సంరక్షణ కార్యదర్శులు, గ్రామ వ్యవసాయ సహాయకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాలలో రాజకీయ పార్టీలకు సంబంధించిన వాల్ పోస్టర్లు, ఫ్లెక్సీలు, పార్టీ జెండాలు, గోడలపై రాతలు ఉండకూడదన్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ జే మధుబాబు, ఎంపీడీవో బి శంకరరావు పాల్గొన్నారు.

టీడీపీలోకి చేరికలు

విశాలాంధ్ర-సంతనూతలపాడు : మండలంలోని ఎనికపాడు గ్రామానికి చెందిన 25 ఎస్సీ బీసీ కుటుంబాలు వైసీపీని వీడి టిడిపి యువ నాయకులు బొమ్మజి అనిల్ కుమార్ సమక్షంలో మంగళవారం టిడిపిలో చేరారు. వీరికి టిడిపి జనసేన బిజెపి ఉమ్మడి అభ్యర్థి బిఎన్ విజయ్ కుమార్ టిడిపి కండువా కప్పి టిడిపి పార్టీలోకి సాధారణంగా ఆహ్వానించారు. జరగబోయే ఎన్నికలలో అత్యధిక మెజార్టీతో తమ గెలుపు కృషి చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ సెక్రటరీ ఆదక స్వాములు, టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు మద్దినేని హరిబాబు టీడీపీ యువనాయకులు ఎన్ఆర్ఐ పుట్టా కిషోర్, రాష్ట్ర ఎస్సీ సెల్ సెక్రటరీ వివరం గోవింద్, బాపట్ల పార్లమెంట్ సోషల్ మీడియా సెక్రటరీ రావులపల్లి సురేష్, పుట్టా సాంబశివరావు ముండ్లమూరి ప్రసాద్, నల్లూరి వెంకట్రావు, గ్రామ పార్టీ అధ్యక్షులు నల్లూరి వెంకట్రావు మొనపాటి వెంకట్రావు నల్లూరి గోపి యాద్దనపూడి వీరన్నారాయణ టీడీపీ కార్యకర్తలు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

అర్చకులపై దాడి దుండగులను అరెస్టు చేయాలి

ధూళిపాళ్ల మల్లికార్జునరావు

విశాలాంధ్ర-కనిగిరి : కాకినాడ శివాలయంలో పనిచేసే అర్చకులు సాయి శర్మ, విజయ్ కుమార్ శర్మలపై ఇటీవల గర్భగుడి వద్ద భౌతిక దాడులకు పాల్పడటం హేయమైన చర్యని బ్రాహ్మణ హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షులు ధూళిపాళ్ల మల్లికార్జునరావు మంగళవారం తీవ్రంగా ఖండించారు. స్థానిక అర్చకులను కాళ్ళతో తన్ని భౌతిక దాడి చేసిన వైసిపి మాజీ కార్పొరేటర్ సిరియాల చంద్రశేఖర్ పై కేసు నమోదు చేసి తక్షణమే అరెస్టు చేయాలని ఆయన కోరారు. నిందితుడికి మద్దతిస్తున్న ఆలయ ఈఓ, కాకినాడ డిఎస్‌పిలను వెంటనే బదిలీ చేయాలని బ్రాహ్మణ హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షులు ధూళిపాళ్ల మల్లికార్జునరావు డిమాండ్ చేశారు.

చట్టాన్ని అతిక్రమిస్తే క్రిమినల్ కేసులు తప్పవు

విశాలాంధ్ర-యర్రగొండపాలెం : చట్టానికి అందరూ సమానులే. ఎన్నికల ప్రవర్తన నియమావళిని అధిగమిస్తే క్రిమినల్ కేసులు తప్పవని ఎర్రగొండపాలెం నియోజకవర్గ ఎన్నికల అధికారి డాక్టర్ శ్రీలేఖ, సర్కిల్ ఇన్స్పెక్టర్ రాములు నాయక్ తెలిపారు. మంగళవారం యర్రగొండపాలెం పోలీస్ స్టేషన్ ఆవరణలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల నియమావళి పై రాజకీయ నాయకులతో సమావేశం నిర్వహించారు. కోడ్ అమలులోకి వచ్చినందున బహిరంగ ప్రదేశాలలో పార్టీలకు సంబంధించిన ఎలాంటి బోర్డులు, ఫ్లెక్సీలు కనిపించరాదన్నారు. అనుమతులు లేకుండా సభలు, సమావేశాలు, ప్రచారాలు, ర్యాలీలు నిర్వహించరాదని చెప్పారు. నాయకుల ప్రచారం బహిరంగ సమావేశాలు వాహనాలకు పార్టీ స్టిక్కర్లు, ఫ్లెక్సీల ఏర్పాట్లకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని చెప్పారు. సువిధా యాప్ ద్వారా ఆన్లైన్లో అనుమతులు పొంద వచ్చు అని తెలిపారు. అధికారుల నుండి ఎలాంటి అనుమతులు లేకుండా సభలు, సమావేశాలు నిర్వహించినా, ప్రచారాలు చేసినా, వాహ నాలకు పార్టీ స్టిక్కర్లు అంటించినా క్రిమినల్ కేసులు బనాయించ బడుతుందని తెలిపారు. వాహనాలను సీజ్ చేయటం జరుగుతుందన్నారు. ప్రజా ప్రతినిధులు ఓటర్లను వివిధ రకాలుగా ప్రలోభాలకు గురి చేస్తే సమాచారం ఇవ్వడం ద్వారా తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల సమయంలో డబ్బులు, మద్యం పంపిణీ చేయడం నేరమన్నారు. రాజ్యాంగం కల్పించిన పవిత్రమైన ఓటు హక్కును అమ్ముకోకుండా స్వేచ్ఛగా వినియోగించుకోవాలని తెలిపారు. ఎన్నికల విధులు నిర్వహించడానికి వచ్చిన అధికారులకు అన్ని పార్టీలు సమానమేనన్నారు. ఎన్నికల ముగిసే వరకు 144వ సెక్షన్ అమలులో ఉంటుంది కాబట్టి ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇంకా ఎస్సై సుదర్శన్ మాట్లాడారు. వివిధ పార్టీల రాజకీయ నాయకులు పాల్గొన్నారు.

వెలిగండ్లలో సాయుధ బలగాలతో కవాత్



విశాలాంధ్ర-వెలిగండ్ల : కనిగిరి నియోజకవర్గంలోని వెలిగండ్ల మండల కనిగిరి డిఎస్పి రామరాజు, పామూరు సిఐ రామ్ నాయక్ కనిగిరి సిఐ బి వెంకటేశ్వర్లు, వెలిగండ్ల ఎస్ఐ ఎం శివ వీరి ఆధ్వర్యంలో కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించి వెలిగండ్ల బస్టాండు సెంటర్ యందు ప్రజలకు ఎన్నికల కోడ్ పై అవగాహన నిర్వహించి ఈ సందర్భంగా డీఎస్పీ రామరాజు మాట్లాడుతూ ఎన్నికల కోడ్ ను ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోడ్ ఉల్లంఘిస్తే చట్టపరమైన కఠిన చర్యలు ఉంటాయని అన్నారు. పామూరు సిఐ రామ్ నాయక్ మాట్లాడుతూ సోషల్ మీడియా ద్వారా మతతత్వాలను అలానే మనుషులను రెచ్చగొట్టే విధంగా సోషల్ మీడియా పోస్టు నిర్వహిస్తే వారిపై కఠిన చర్యలు ఉంటాయని వారన్నారు. వెలిగండ్ల ఎస్ఐ శివ మాట్లాడుతూ ఈ కవాతు ఎన్నికల సమయంలో ప్రజలకు అవగాహన కల్పించేందుకు నిర్వ హించడం జరుగుతుందని కేసులు నమోదైతే వారిపై రౌడీ షీట్ ఓపెన్ చేయటం జరుగుతుంది. రాగదేశాలకు పోకుండా పలు జాగ్రత్తలు పాటించాలని పోలీసు వారికి సహకరించాలని వారు కోరారు. వెలిగండ్ల మండల ప్రజలందరూ మునుపెన్నడు లేని విధంగా కేంద్ర సాయుధ బలగాల చేత కవాతు నిర్వహించి అవగాహన కల్పించినందుకు పోలీసు వారి గ్రామస్తులు ధన్య వాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్స్ అచ్చిరెడ్డి, శ్రీను, వెంకట్, భాష హోంగార్డ్స్ పాల్గొన్నారు.

అర్చకులపై దాడి సిగ్గుచేటు

విశాలాంధ్ర - రేపల్లె : శివాలయ అర్చకులపై దాడి అమానుషమని బ్రాహ్మణ సంక్షేమ సమైక్య సభ్యులు సివి మోహన్ రావు ఖండించారు. కాకినాడ శివాలయంలో సోమవారం రాత్రి విధులు నిర్వహిస్తున్న అర్చకులపై కాకినాడ మాజీ కార్పొరేటర్ పరుష పదజాలంతో దూషిస్తూ అర్చకులపై చేసిన దాడికి నిరసన తెలిపారు. ఈ మేరకు నిందితునిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ తహసిల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాకినాడకు చెందిన మాజీ కార్పొరేటర్ శివాలయంలోనికి వచ్చి తను ఇచ్చిన పాలు శివలింగంపై సరిగా పోయలేదని గర్భగుడి వద్ద విధులు నిర్వహిస్తున్న అర్చకులు వెంకట సత్య సాయిపై దాడి చేయడం దుర్మార్గమన్నారు. ఆలయం లోనే ప్రక్కన ఉపాలయంలో పనిచేస్తున్న సహాయ అర్చకులు మద్దిరాల విజయ్ కుమార్ అడ్డురాగా అతనిని అసభ్య పదజాలంతో దూషించి చేయిజేసుకోవటం దుర్మార్గమన్నారు. అర్చకులను బెదిరించి, కొట్టిన మాజీ కార్పొరేటర్ చంద్రరావు మీద వెంటనే చర్యలు తీసుకొని శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కొట్టారు పూర్ణచంద్రరావు, అగస్త్య, చావలి సురేష్ శర్మ, నాగశ్రీ తదితరులు పాల్గొన్నారు.

తర్లు పాడు రైల్వే స్టేషన్ వద్ద తనిఖీలు

విశాలాంధ్ర-తర్లుపాడు : తర్లుపాడు మండల కేంద్రంలోని రైల్వే స్టేషన్ వద్ద రాబోయే ఎన్నికల దృష్టిలో ఉంచుకొని అధికారులు వాహనాలను తనిఖీ నిర్వహించారు. ఎన్నికల సంబంధించి అక్రమాలకు తావు ఇవ్వకుండా వస్తువు ప్రచార సామాగ్రి తదితర వస్తువు సామాగ్రి వాహనాలలో తరలించకుండా వాహనాలను నిలిపి ప్రత్యేక అధికారి ఎన్‌యు అరుణ ఆధ్వర్యంలో పోలీసులు ప్రత్యేకంగా వాహనాలను తనిఖీ చేస్తూ వీడియో కూడా తీస్తున్నారు. వాహనాలు మీద నాయకుల స్టిక్కర్లు ఉన్న స్టిక్కర్లను తీసేస్తున్నారు. ఎన్నికల దృష్టిలో ఉంచుకొని మార్కాపురం తర్లుపాడు కంభం తాడువారి పల్లె రహదారి మార్గాలలో వాహనాలలో అక్రమ రవాణా జరగకుండా కట్టుదిట్టమైన తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఎన్‌యు అరుణ తెలిపారు. అక్రమంగా నగదు మద్యం ఎన్నికల ప్రచారం సామాగ్రి పట్టుబడితే వాటిని సీజ్ చేయటం జరుగుతుందని ఆమె తెలిపారు.

సీపీఐ నేత ప్రభాకర్‌కి పితృవియోగం

విశాలాంధ్ర-పామూరు : మండల సిపిఐ కార్యదర్శి పోతుల ప్రభాకర్ తండ్రి పోతుల తిరుపాలు మంగళవారం ఉదయం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న సిపిఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ పామూరు చేరుకుని తిరుపాలు పార్థివ దేహాన్ని సందర్శించి ఎర్రజెండా కప్పి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. బుధవారం ఉదయం 9 గంటలకు అంత్యక్రియలు నిర్వహిస్తారని ప్రభాకర్ తెలిపారు. నివాళు లర్పించిన వారిలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సయ్యద్ మౌలాలి, వి. సుబ్బారావు, నాయభ, నరసింహారావు, సూరిబాబు, తదితరులు ఉన్నారు.

IN THE COURT OF THE HON'BLE V ADDL.DIST. JUDGE::GUNTUR
M.V.O.P.No: 318 / 2015
Between:
Adigopula Bharath - Petitioner
And
Kistaparapu Satish & Others ... Respondents
To,
R-4: Yarraguntla Seshaiah,
S/o. Not known, R/o. Door No : 6-129, Z.P.Colony, Ongole.
పై నెంబరు O.P.ని పిటీషనరు యాక్సిడెంటులో తనకు కలిగిన గాయములకు నష్టపరిహారము కోరుచూ ఈ పిటీషన్ దాఖలు చేసుకొనగా సదరు పిటీషనులో 4వ రెస్పాండెంట్ అయిన మీరు కోర్టు నోటీసులు తీసుకొనక కాలయాపన చేయు చున్నందున ఈ వార్త పత్రిక ద్వారా మీకు తెలియజేయమని శ్రీ కోర్టు వారు ది: 15-04-2024 కి వాయిదా వేసినారు. కావున ఆ రోజున ఉ.గం. 10-30 ని.లకు పై కోర్టు వారి ఎదుట స్వయముగా గాని, ప్లీడరు గారి ద్వారాగాని హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనిచో శ్రీ కోర్టు వారిచే మీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదా తేది: 15-04-2024
పి. స్వామి, పిటీషనర్ తరపు అడ్వకేట్, గుంటూరు, సెల్: 8790620398

మానవ హక్కులు, చట్టాలపై అవగాహన ఉండాలి

విశాలాంధ్ర-సీఎస్‌పురం : మండలంలోని చెన్నపునాయనపల్లి గ్రామంలో ప్రాథమిక ఉన్నత పాఠశాలలో మంగళవారం మానవ హక్కులు మరియు వివిధ చట్టాల మీద అవగాహన సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మానవ హక్కుల సంఘం అధ్యక్షులు డాక్టర్ షేక్ గౌస్ మాట్లాడుతూ మానవుని జీవితంలో మానవ హక్కులనేవి చాలా విలువైనవని, ప్రతి ఒక్కరు కూడా మానవ విలువలతో గౌరవించుకుంటూ ఇతరుల హక్కులను భంగం కలిగించకుండా సమాజంలో ముందుకు వెళ్లాలని, చట్టాలను ప్రతి ఒక్కరు గౌరవించాలని చిన్న వయసులోనే విద్యార్థి దశలోనే పిల్లలు అవగాహన కలిగి ఉండాలని ఆయన తెలిపారు. పిల్లలతో మానవ హక్కుల ప్రతిజ్ఞ చేపించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జిల్లా ఉత్తమ అవార్డు గ్రహీత షేక్ చాంద్ బాషా సిద్దయ్య షరీఫ్ పాల్గొన్నారు.

దారపనేనిని సన్మానించిన బుద్ధ వెంకన్న

విశాలాంధ్ర-పామూరు : కనిగిరి మాజీ ఏఎంసీ ఛైర్మన్ దారపనేని చంద్రశేఖర్‌ను విజయవాడ పశ్చిమ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మంగళవారం ఉత్తరాంధ్ర జిల్లాల తెలుగుదేశం పార్టీ కన్వీనర్ మాజీ ఎమ్మెల్సీ బుద్ద వెంకన్న ఘనంగా దుశ్శాలువాతో సన్మానించారు. జగన్‌రెడ్డి సైకో ప్రభుత్వాన్ని సాగనం పడానికి సర్వత్ర సిద్ధంగా ఉండాల్సిన ఆవశ్యకత ఏర్పడిందని బుద్ద వెంకన్న పేర్కొన్నారు. వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో మాగుంట శ్రీనివాసులురెడ్డి, డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహ రెడ్డి ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు సమక్షంలో దారపనేని చంద్రశేఖర్ తెలుగుదేశం తీర్థం పుచ్చుకోవడం చాలా సంతోష కరమన్నారు. రాష్ట్రంలో ప్రజలు సంక్షేమం, అభివృద్ధి కోరుకుంటున్నారని జగన్ రెడ్డి ప్రభుత్వాన్ని సాగనంపడానికి సిద్ధంగా ఉన్నారని బుద్ద వెంకన్న తెలిపారు.

అర్చకులపై దాడి అమానుషం

విశాలాంధ్ర - చీరాలరూరల్ : కాకినాడలోని దేవాలయం వీధిలో ఉన్న పాత శివాలయంలో పూజ సరిగా చేయలేదనే వంకతో అర్చకునిపై దాడి చేయడమే కాక అడ్డు వచ్చిన మరొక అర్చకునిపై కూడా దాడి చేసిన మాజీ కార్పొరేటర్, వైకాపా నాయకులు చంద్రరావు చర్య అమానుషమని చీరాల పురోహిత సేవా సంఘం ప్రతినిధులు అన్నారు. పౌర్ణమి సోమవారం సందర్భ ంగా రద్దీగా ఉన్న దేవాలయంలో సంతృప్తి కరంగా పూజ చేయలేదనే మిషతో ఆలయ అర్చకులను దేవాలయ ప్రాంగణంలోనే దుర్భాష లాడుతూ భౌతికంగా దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు శనగవరపు నాగమల్లేశ్వర శర్మ, కార్యదర్శి మంత్రి ప్రగడ ఆంజనేయ శర్మ, అప్పాజోశ్యుల బదరీ నారాయణ, కళ్యాణ్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదల సంఘం అధ్యక్ష, కార్యదర్శులుగా శ్రీరమణి, రేష్మ

విశాలాంధ్ర-పర్చూరు: పర్చూరు కోర్టులో 2024-25 సంవత్సరానికి న్యాయవాదల సంఘంకు మంగళవారం ఎన్నికలు జరిగాయి. అధ్యక్షులుగా చంద్రు శ్రీరమణి, కార్యదర్శిగా షేక్ రేష్మ, కోశాధికారిగా దగ్గుబాటి రాఘవయ్య చౌదరి ఏకగ్రీవంగా ఎన్నికైనారు. కార్యవర్గ సభ్యులుగా కొల్లా నరేంద్రకుమార్, రావి శ్రీనివాసరావు, యార్లగడ్డ వెంకటేశ్వరరావు, చాగంటి సుబ్బారావు, కట్టా సల్మాన్, వెంగళశెట్టి తిరుమలరావు ఉన్నారు. నూతన కార్యవర్గం ధన్యవాదములు తెలపగా... న్యాయవాదులు శుభాకాంక్షలు తెలిపారు.

పైసలిస్తేనే ప్రచారం

- మారిన కార్యకర్తల వ్యవహార శైలి
- రోజువారి కూలీలుగా కార్యకర్తలు
- హడలెత్తిపోతున్న అభ్యర్థులు

విశాలాంధ్ర-పీసీపల్లి : ఎన్నికల ప్రచార శైలి పూర్తిగా మారిపోయింది గతంలో ఎన్నికల ప్రచారానికి కార్యకర్తలే స్వచ్ఛందంగా తరలివచ్చి జెండాలు పట్టుకుని తమ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కృషిచేసి ప్రతిష్ఠాత్మకంగా భావించి పనిచేసేవారు కానీ నేడు పరిస్థితులు అందుకు భిన్నంగా మారాయి పార్టీ జెండాలు మోసే వాళ్ళలో మెజార్టీ ఎక్కువగా ఎన్నికల కూలీలే కనపడుతున్నారు కూలీ డబ్బులు ఇవ్వకుండా జెండా మోసే నాధుడే ఇప్పుడు కరువవుతున్నారు. రాజకీయాల్లో పోటీచేసే అభ్యర్థులకు ఈ వ్యవహారం పల్లెటూరులలో ఒక రకంగా ఉంటే ఇది పట్టణ ప్రాంతాల్లో మరింత తలనొప్పులు తెస్తుంది ఇది ఇలాఉంటే ఎన్నికల కార్యకర్తలను సభలకు తీసుకొచ్చే లీడర్లు కూడా మఠామేస్త్రిలా వ్యవహరిస్తూ అందినకాడికి దండుకుంటున్నారు ఇటువంటి వారి ఆటలు మూడుపువ్వులు ఆరుకాయలుగా సాగుతున్నాయి 50 మంది కార్యకర్తలను ప్రచారానికి తీసుకువచ్చి 100 మందిని తెచ్చినట్లు అభ్యర్థులకు చెబుతూ ఆ మిగిలిన సొమ్మును జేబులో వేసుకుంటున్నారు. సొమ్ము పోతేపోయింది ప్రచారంలో సరిగా పాల్గొంటున్నారా అంటే అదీలేదు అభ్యర్థి ఇంటింటికి తిరిగి ప్రచారం చేస్తుంటే డబ్బు తీసుకున్న కూలీ కార్యకర్తలు ఎక్కడ చెట్టునీడ కనిపిస్తే ఆచెట్టునీడన సేద తీరుతూ కొంచెంసేపు మాత్రమే ప్రచారంలో పాల్గొని ఆతర్వాత మెల్లగా అక్కడినుంచి జారుకుంటున్నారు. అన్ని పార్టీలకు ఒకేకూలీలు ప్రచారం నిర్వహిస్తున్నారు. అయితే కొన్ని పార్టీలకు సొంత కార్యకర్తలు ఉన్నారుకానీ వారిలో జెండాలుమోస్తూ ఎండలో కష్టపడే వారిశాతం చాలాతక్కువ ప్రచారంలో తీన్మార్ మేళం తప్పనిసరిగా ఏర్పాటు చేస్తున్నారు మరోవైపు ప్రచారం చేయాలంటే కార్యకర్తలకు సొమ్ములు చెల్లిస్తేనే తప్ప రావటంలేదు ఆంధ్రప్రదేశ్ లోఎన్నికలు మొదటి దశలో జరుగుతాయని రాజకీయపక్షాల నేతలు భావించారు అయితే వారు అనుకున్న దానికంటే విరుద్ధంగా కేంద్ర ఎన్నికల సంఘం నాలుగో విడతలో రాష్ట్రంలో ఎన్నికలు నిర్వహించేందుకు షెడ్యూల్ విడుదల చేయడంతో రాజకీయపక్షాలనేతలు డీలపడ్డారు మొదటి దశలో ఎన్నికలు జరుగుతాయనే భావంతో పలువురు అభ్యర్థులు ప్రచారం ముమ్మరం చేశారు అయితే ఎన్నికల కమిషన్ షాక్ ఇవ్వడంతో కొంతమంది ప్రచారం నిలుపుదల చేయగా కొంతమంది వేగం తగ్గించారు ఇప్పటినుంచే ప్రసారం చేస్తే ఎన్నికల ఖర్చులు అధికం చేస్తారనే భయం అభ్యర్థులను వెంటాడుతుంది ఎన్నికల ప్రచారంలో ఏ పార్టీకైనా మెండుగా కార్యకర్తలు కనిపించాలి ఎక్కువ మంది కార్యకర్తలు కనిపిస్తే ఎన్నికల సంఘం ఖర్చు రాస్తున్నప్పటికీ ప్రజల్లో బలం చూపించేందుకు జన సమీకరణ ఆయా పార్టీలకు తప్పదు అందుకే ప్రధాన పార్టీ అభ్యర్థులు జనాన్ని సమీకరించుకోవడంలో రాజకీయ కూలీలను ఆశ్రయించక తప్పడం లేదు ప్రచారంలో పాల్గొన్నప్పటి నుంచి వారికి భోజనాలు టిఫిన్లు టీలు మరియు ముఖ్యంగా మద్యం అందజేయాల్సిన పరిస్థితులు నేడు నెలకొన్నాయి దీంతో ఎన్నికల ఖర్చు తడిసి మోపెడు అవుతుందని అభ్యర్థులు వాపోతున్నారు పాతతరం రాజకీయాలు వచ్చిన తర్వాత పార్టీల మధ్య రాజకీయాలు వైమానుస్యాలు తగ్గిపోయాయి ఆయా పార్టీల కార్యకర్తల్లో మినీటెన్సీ స్వభావం లేకుండా పోయింది ఫలితంగా తమ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం ఆ పార్టీ జెండాను దించకుండా తెగించి పోరాడేతత్వం కార్యకర్తల్లో కనుమరుగైపోయింది. ఈ పరిణామాలతో రాజకీయ పార్టీలు తప్పనిసరిగా కొంతమంది కార్యకర్తలకు డబ్బులు చెల్లించి అద్దె కార్యకర్తలను ఆశ్రయించటం అనివార్యంగా మారింది ప్రధాన రాజకీయ పక్షాలకు చెందిన ముఖ్య నాయకులు ర్యాలీలకు బహిరంగ సభలకు సైతం సొమ్ములు చెల్లించి అద్దె కార్యకర్తలను తెచ్చుకునే స్థాయికి పరిస్థితులు దిగజారిపోయాయంటే ప్రస్తుత రాజకీయాలు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. దీంతో సొంత పార్టీ కార్యకర్తలు కూడా తమకు ఎంతో కొంత డబ్బులు ముట్టచెబితేనే పార్టీ కోసం పని చేసే స్థితికి చేరారనే వాదన రాజకీయ వర్గాల్లో బలంగా వినిపిస్తుంది ఇటువంటి పోకడలతో సాధారణ నాయకులు ఎన్నికల్లో పోటీ చేసే అవకాశాలు పూర్తిగా సన్నగిల్లుతున్నాయి అందుకే ప్రధాన పార్టీలు కూడా ప్రజా ఉద్యమాల్లో పనిచేసి ప్రజల్లో మంచి పేరున్న నాయకులను సైతం పక్కనపెట్టి ఎన్నికల్లో కోట్ల కొద్ది డబ్బు ఖర్చు చేయగల కార్పొరేట్ అభ్యర్థులకు మాత్రమే టికెట్లు కేటాయిస్తున్నాయి ఆయా నేతలు ఎన్నికల్లో డబ్బులు మంచినీళ్ల ప్రాయంగా ఖర్చు చేస్తున్నారు ఎన్నికల్లో ప్రజాభిమానాన్ని పొందటం ద్వారా ఓటర్ల మనసు తెలుసుకోవాలని వివచనలో అభ్యర్థులు లేరు కార్పొరేట్ అభ్యర్థులు ఎక్కువ డబ్బు ఖర్చు పెట్టి ఓట్లు కొనడంతోనే పోటీపడుతూ ముందుకు సాగుతున్నారు తద్వారా ఈ కార్పొరేట్ అభ్యర్థులు ప్రజలు మెచ్చిన మహానేతగా కీర్తింపబడే పరిస్థితులు నేటి రాజకీయాల్లో కనపడుతున్నాయి ఈ పరిస్థితులను పరిశీలిస్తున్న సాంప్రదాయవాదులు రాజకీయ విశ్లేషకులు రానురాను ఎన్నికల్లో రాజకీయ పార్టీలు పోరాడే పద్ధతిలో వస్తున్న వింత మార్పులపై ఆందోళన చెందుతున్నారు ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో అసలైన ప్రజా నాయకులు ఎన్నికల్లో పోటీ చేసే అవకాశమే లేకుండా పోయింది వారు ఏ ప్రజా సంఘాల్లోనో ఏ కుల సంఘాలలోనో నాయకులుగా వ్యవహరించాల్సిన పరిస్థితులు ప్రస్తుతం ఏర్పడ్డాయి డబ్బులు లేని నిజమైన నాయకులు కనీసం సర్పంచి పదవికి కూడా పోటీ చేసేందుకు పనికిరారు అనే విధంగా ప్రస్తుత రాజకీయాల్లో పరిస్థితులు మారిపోయాయి మొత్తం మీద ఈ వింత పరిస్థితుల నుండి రాజకీయ వ్యవస్థను కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉందని మేధావులు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

28న వైద్య నిర్ధారణ శిబిరం

విశాలాంధ్ర-అద్దంకి : ఈనెల 28న స్థానిక భవిత కేంద్రం యం.పి.యు.పి స్కూల్ (సత్రంబడి) ఆవరణ నందు సహిత విద్య-సమగ్ర శిక్ష బాపట్ల జిల్లా ఆధ్వర్యంలో 6నుండి18 సంవత్సరాలలోపు గల ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు ఉచిత సహాయ ఉపకరణాల కొరకు వైద్య నిర్ధారణ శిబిరం నిర్వహిస్తున్నట్లు మండల విద్యాశాఖ అధికారులు బి.సుధాకరరావు, డి.గంగాధరరావులు తెలిపారు. మంగళవారం భవిత కేంద్రంలో విద్యాశాఖ అధికారులు మాట్లాడుతూ అద్దంకి నియోజకవర్గ పరిధిలోని అద్దంకి, బల్లికురవ, సంతమాగులూరు, జె.పంగులూరు, కొరిశపాడు మండలాలలోని వినికిడి లోపం గల పిల్లలకు వినికిడి యంత్రాలు, దృష్టి లోపం గలవారికి కంటి అద్దాలు, బ్రెయిలీ కిట్, మానసిక వైకల్యం, ఆటిజం(బుద్ధిమాంధ్యత) గలవారికి టి.యల్.యం, కిట్, శారీరక అంగవైకల్యం కలవారికి ట్రైసైకిల్, వీల్‌చైర్, రోలేటర్ మొదలగు ఉపకరణాలు నిపుణులైన వైద్యులచే వైద్య ధృవీకరణ పరీక్షలు నిర్వహించి ఉచితంగా ఉపకరణాలు అందజేయడం జరుగుతుందని మండల విద్యాశాఖ అధికారులు తెలిపారు. వైద్య శిబిరానకు హాజరగు చిన్నారులు సదరం సర్టిఫికెట్ జిరాక్స్, కుల ధృవీకరణ సర్టిఫికెట్ జిరాక్స్, 2 ఫోటోలు, యు.డి.ఐ.డి కార్డు తీసుకొని రావాలని తెలిపారు. పూర్తి వివర ములకు 9849960723, 9100996459 ఫోన్ నంబర్లను సంప్రదించాలని విద్యాశాఖ అధికారులు తెలిపారు.

బాల్యవివాహాలు నిరోధించేలా కళాజాత

విశాలాంధ్ర - బల్లికురవ : బాల్య వివాహాలు నిరోధించేలా ప్రజలకు అవగాహన కల్పించేందుకు నేడు సంతమాగులూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని రెండు కళాజాత టీములు కార్యక్రమాలు నిర్వహించినట్లు సిడిపిఓ డి.సుధా ఒక ప్రకటనలో తెలిపారు.బల్లికురవ మండలంలోని కూకట్లపల్లి,మల్లాయపాలెం,బల్లికురవ సంతమాగులూరు మండలంలోని గురిజేపల్లి ఏల్చూరు సంతమాగులూరు గ్రామాలలో కళాజాత నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ కళాజాత ద్వారా బాల్య వివాహాలు చేయడం వలన కలిగే అనర్థాలను వివరిస్తారని ఈ కార్యక్రమానికి గ్రామములోని ప్రజలంతా పాల్గొని గ్రామస్థాయిలో బాల్య వివాహాలు నిర్మూలించేందుకు సహకరించాలన్నారు.

విశాలాంధ్ర కథనానికి స్పందించిన అధికారులు

విశాలాంధ్ర-టంగుటూరు : మల్లవరప్పాడు గ్రామ పంచాయతీ అధికారులు మంగళవారం విశాలాంధ్రలో ప్రచురితమైన 'పంచాయితీ అధికారులకు ఎన్నికల నిబంధనలు పట్టవా' అనే కథనానికి స్పందించారు. మంగళవారం ఉదయం 10 గంటల సమయంలో మా గుంట శ్రీనివాసులు రెడ్డి, మాగుంట రాఘవరెడ్డి పేర్లతో రహదారి అభివృద్ధి పనులు అని ఉన్న ఫ్లెక్సీని పంచాయతీ అధికారులు తొలగించారు. అయితే గ్రామస్థాయి అధికా రులు ఎన్నికల నిబంధనలను అమలు చేయడంలో అల సత్వం వహిస్తున్నారు. మండల స్థాయి అధికారుల పర్యవేక్ష ణ లోపం వలన కొంతమంది అధికారులు నిబంధనలను బేఖాతరు చేస్తున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. ఎన్నికల నిబంధనలను అమలు చేయని అధికారుల పట్ల క్రమశిక్షణ చర్యలు తీసుకోవడంలో మండల స్థాయి అధికారులు విఫలమయ్యారని తేటతెల్లమవుతుంది.

పోలింగ్ కేంద్రాల వద్ద ఆటంకాలు కలిగిస్తే కఠిన చర్యలు

విశాలాంధ్ర-శావల్యాపురం: ఎన్నికల నిబంధ నలను అతిక్రమించి పోలింగ్ కేంద్రాల వద్ద అటంకాలు కలిగించే వారిపై కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ వివిఎన్ వర్మ అన్నారు. పోలీసులు, కేంద్రబలగాలపై గ్రామాల్లోని ప్రజలకు అవగాహన కల్పించేందుకు వేల్పూరు గ్రామంలో మంగళవారం కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు. డివిస్పి మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినందున ప్రజలందరూ గుంపులుగా ఉండరాదని, రాజకీయపార్టీల జెండాలు కట్టరాదని, ర్యాలీలకు అనుమతులు లేవని, ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. యువకులు, ఉద్యోగులు గొడవల్లో తలదూర్చి తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు.ఆధారాలు లేకుండా నగదును బదిలీ చేయడం, బెట్టింగ్లకు పాల్పడడం చట్టరీత్యా నేరమన్నారు. పోలింగ్ రోజున 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, ప్రజలంతా ప్రశాంతంగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. గ్రామాల్లో సమస్యలుంటే పోలీసులకు సమాచారమందించాలని, లేకుండా సి-విజిల్ యాప్ నందు పిర్యాదు చేయాలని తెలిపారు. వినుకొండ టౌన్, రూరల్ సిఐలు సాంబశివరావు, సుధాకర్ రావు, ఐనవోలు ఎస్ఐ లక్ష్మీనారాయణ, స్థానిక ఎసై చల్లా సురేష్, పాల్గొన్నారు.

పంటల మార్పిడి పై అవగాహన

విశాలాంధ్ర-రొంపిచర్ల: మండలంలో వి.రెడ్డి పాలెం గ్రామంలో మంగళవారం బాపట్ల వ్యవ సాయ కళాశాల విద్యార్థులు రైతులకు పంటల మార్పిడి విధానం పై అవగాహన కలిగించారు. విలేజ్ మ్యాప్ ద్వారా రైతులకు పంటల సాగు విధానం పై అవగాహన కలిగించారు. రైతులు పంటల సాగులో తీసుకోవల సిన జాగ్రత్తలు గురించి వివరించారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడులు వచ్చే పంటలు సాగు చేసుకోవాలని అన్నారు.రైతులు సాగు చేస్తున్న పైర్లకు వచ్చే చీడపీడల నివారణకు వాడవలసిన మందులు గురించి వివరించారు.

అదే విధంగా రైతులు సాగు చేస్తున్న పంటలకు ప్రభుత్వం కల్పిస్తున్న కనీస మద్దతు ధర గురించి వివరించారు. విలేజ్ మ్యాప్ ద్వారా పంటల సాగు విధానం రైతులను విశేషముగా ఆకట్టుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

నియమావళి ఉల్లంఘిస్తే ఉపేక్షించం..

ఎన్నికల అధికారి హేలా షారోన్

విశాలాంధ్ర - రేపల్లె : ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలు ఉపేక్షించేదిలేదని, ప్రభుత్వ ఉద్యోగులు పార్టీల ప్రచార కార్యక్రమాల్లో పాల్గొంటే చర్యలు తప్పవని ఎన్నికల రిటర్నింగ్ అధికారి హేలా షారోన్ హెచ్చరించారు. మంగళవారం ఎన్నికల నియమ నిబంధనలపై రాజకీయ పార్టీలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల తేదీలు ప్రకటించడంతో రాష్ట్రంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి కట్టుదిట్టం చేశామన్నారు. రాజకీయ పార్టీల అభ్యర్థులు తప్పనిసరిగా ఎన్నికల నియమ నిబంధనలు పాటించాలని కోరారు. అభ్యర్థులు ప్రచారానికి ఉపయోగించే వాహనాలకు అనుమతులు తప్పనిసరన్నారు. ఇంటింటి ప్రచారం, ర్యాలీలు మీటింగులు పెట్టుకునేందుకు సంబంధిత ఎన్నికల రిటర్నింగ్ అధికారి వద్ద అనుమతులు తీసుకోవాలన్నారు. పాంప్లెట్లు, బ్యానర్లు, పోస్టర్లు, హోర్డింగులు ఏర్పాటు విషయంలో అనుమతులు తీసుకోవాలని తెలిపారు. రాజకీయ పార్టీల మీటింగ్లతో పాటు రోడ్లపై పెట్టే సభలు, సమావేశాలకు అనుమతులు తప్పనిసరి అన్నారు. వాలంటరీలు ఎన్నికల విధులు దూరంగా ఉండాలని సూచించారు. నిబంధనలు పాటించకుండా ఒక రాజకీయ పార్టీ వైపు ప్రచారంలో పాల్గొన్న, పాంప్లెట్లు పంచిన, ఇంటింటి ప్రచారం నిర్వహించిన చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇప్పటికే నియోజకవర్గంలోని చెరుకుపల్లిలో ముగ్గురు వాలంటీర్లను నిజాంపట్నం మండలంలో ఒక వాలంటీర్ను విధుల నుంచి తొలగించామన్నారు. వాలంటరీలు ఆన్లైన్లో గ్రూపులను ఏర్పాటు చేసి రాజకీయ ప్రచారం చేయటం చట్టరీత్యా నేరమన్నారు. అటువంటి వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. పార్టీల ప్రచారాలకు చిన్న పిల్లలను ఉపయోగించవద్దని సూచించారు. రాజకీయ పార్టీల అభ్యంర్థులు సువిధ పోర్టల్ ద్వారా ఎన్నికలకు సంబంధించిన వివిధ అనుమతులను తీసుకువచ్చని తెలిపారు. ఎన్నికల కోసం తాత్కాలిక పార్టీ కార్యాలయా లను పోలింగ్ స్టేషన్కు రెండు వందల మీటర్ల దూరంలో ఏర్పాటు చేయకూడదని, ప్రైవేట్ స్థలాలలో, పాఠశాల సమీపంలో, ఆధ్యాత్మిక ప్రాంతాలకు దగ్గరగా పార్టీ కార్యాలయాలను ఏర్పాటు చేయవద్దని సూచించారు. నిబంధనలు పాటించకుండా కార్యాలయాలు ఏర్పాటు చేస్తే చర్యలు తప్పవన్నారు. బైక్ ర్యాలీలకు అనుమతులు తప్పనిసరి చేశారు. కేవలం 10 బైకులకు మాత్రమే అనుమతులు ఇవ్వడం జరుగుతుందన్నారు. రోడ్డు షో నిర్వహించేటప్పుడు రిటర్నింగ్ అధికారి అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని, ఆ కార్యక్రమంలో ఎన్ని వాహనాలు వాడుతున్నది ఎంతమంది ప్రజలు వస్తారనే విషయాన్ని ముందుగానే తెలియజేయాలని సూచించారు. పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న విద్యార్థులను దృష్టిలో ఉంచుకొని రాజకీయ పార్టీలు లౌడ్ స్పీకర్లను ఉదయం ఆరు గంటల లోపు రాత్రి పది గంటల తర్వాత ఉపయోగించకూడదని హెచ్చరించారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి 24/7 కార్యాలయంలో అందుబాటులో ఉంటారని తెలిపారు. ఎన్నికలకు సంబంధించి ఏవైనా ఫిర్యాదులు ఉంటే సి-విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదులు చేసుకోవాలని సూచించారు. ఫిర్యాదులను 100 నిమిషాలలో పరిష్కరిస్తారన్నారు. ఇతర సమాచారం కొరకు ఆర్.ఓ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. ఫిర్యాదులు ఇతర సమస్యలపై 08648 293795 నంబర్ను సంప్రదించాలన్నారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘనలపై ఏ శాఖపైనైనా ఫిర్యాదులు వస్తే సకాలంలో స్పందించి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎన్నికల నియమావళి అమలుకు సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలను వివరించారు. మహాత్మా గాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం కింద వివిధ రిజిస్టర్డ్ లబ్ధిదారులకు యథావిధిగా ఉపాధి పనులు కల్పించవచ్చని చెప్పారు.

ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడులు

విశాలాంధ్ర - బాపట్ల : ఆధునిక వ్యవసాయ పద్ధతుల ద్వారా రైతులు అధిక దిగుబడులు సాధించవచ్చని బాపట్ల వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ వి.శ్రీనివాసరావు అన్నారు. ఇండియన్ కౌన్సిల్ అఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ ఎస్సీ సబ్ ప్లాన్ క్రింద వ్యవసాయ కళాశాలలో నిర్వహించిన రైతు విజ్ఞాన యాత్ర సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఎస్సీ సబ్ ప్లాన్ ద్వారా రైతులకు వ్యవసాయ రంగంలో ఆధునిక పద్ధతులు, మెళుకువలను ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం నేర్పిస్తుందన్నారు. రైతులు ఇక్కడ నేర్చుకున్న విజ్ఞానాన్ని ఆచరిస్తే ఉత్తమ ఫలితాలను పొందుతారన్నారు. రైతు విజ్ఞాన యాత్రలో భాగంగా రైతులను వివిధ పరిశోధన స్థానాలకు తీసుకెళ్లడం జరిగిందని, వారికి వరి పరిశోధన స్థానంలో మేలైన సాగు పద్ధతుల గురించి శిక్షణ ఇచ్చిందన్నారు. డాక్టర్ ఎన్.టి.ఆర్ కాలేజ్ ఆఫ్ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో పాలు, పాల పదార్థాలు, చిరు ధాన్యాలను వాడుకునే పద్ధతుల గురించి వివరించారన్నారు. వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాలలో వ్యవసాయంలో వాడుకోదగిన నూతన పరికరాల గురించి వివరించి ఆ పరికరాల ద్వారా అపరాలు, చిరుధాన్యాలు, వరిని ప్రాసెస్ చేసే విధానంలో శిక్షణ ఇచ్చామన్నారు. పోస్ట్ హార్వెస్ట్ టెక్నాలజీ సెంటర్లో కోత అనంతర పరిజ్ఞానం గురించి, రవి గార్డెన్స్లో వ్యవసాయ ఆధారిత పరిశ్రమల గురించి అవగాహన కల్పించారన్నారు. ఈ కార్యక్రమంలో విస్తరణ విభాగాధిపతి డాక్టర్ ఎం.సి.ఓబయ్య, డాక్టర్ ఎం. రమా దేవి, డాక్టర్ కె.సుశీల, ఎం.ఎస్.సి, పి.హెచ్.డి, వ్యవసాయ జర్నలిజం విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

చేనేత ఆత్మగౌరవం కోసమే బరిలోకి

విశాలాంధ్ర - చీరాల : చేనేతల ఆత్మగౌరవం నిలబెట్టేందుకు స్వతంత్ర అభ్యర్థిగా పోటీలో నిలుస్తానని మనందరి సహకారంతో చేనేతల సత్తా రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో చూపిద్దామని టీడీపీ సీనియర్ నాయకురాలు పొన్నూరు మాజీ చైర్మన్ సజ్జా హేమలత అన్నారు. మంగళవారం చీరాల నియోజకవర్గంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చేనేతలు ఎక్కువగా ఉన్న చీరాలలో ఏ రాజకీయ పార్టీ అసెంబ్లీ టికెట్ చేనేతలకు కేటాయించలేదన్నారు. చీరాలలో అత్యధికంగా చేనేతలు,ఎస్సీలు ఉండగా ఇక్కడ చేనేతలకు టికెట్ కేటాయించకుండా రాజకీయ పార్టీలు మోసం చేసారన్నారు. మన ఓటు మనం వేసుకొని చేనేతల సత్తా చాటుదామని చేనేతల ఐక్యత రాజకీయ పార్టీలకు చూపుదామన్నారు. మన ఐక్యత మన బలమని ఒకరి పల్లకీలు మోయడం మాని మన ఓటు మనం వేసుకుందామన్నారు. రాజకీయంగా చేనేతలు వెనుకబడ్డారని ముందుకు వెళ్లాలంటే చేనేతలంతా ఐక్యంగా ముందుకు సాగాలన్నారు.

దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు

విశాలాంధ్ర-శావల్యాపురం : 2023వ సంవత్సరం డిసెంబర్ నెలలో సంభవించిన మిచౌంగ్ తుఫాను ప్రభావంతో దెబ్బతిన్న రోడ్లను మరమ్మతులు చేయుటకు ప్రభుత్వం నిదులు మంజూరు చేసినట్లు ఆర్ అండ్ బి ఏఈ కంచేటి నవ్య మంగళవారం తెలిపారు. వినుకొండ సబ్ డివిజన్ పరిధిలో తుఫాను ప్రభావంతో దెబ్బతిన్న రోడ్లను మరమ్మతులు చేయుట కొరకు 13 పనులకు గాను రూ.3 కోట్ల 50 లక్షల నిధులు మంజూరైనట్లు తెలిపారు. ఏనుగుపాలెం, ముప్పరాజుపాలెం రోడ్లకు మరమ్మతులు పూర్తయినట్లు ముక్కెళ్ళపాడు, తంగిరాల రోడ్లకు మరమ్మత్తులు జరుగుతున్నాయన్నారు. కొచ్చర్ల నుండి శావల్యాపురం వరకు 10 లక్షలు, శావల్యాపురం నుండి కారుమంచి శివారు పల్నాడు జిల్లా సరిహద్దు వరకు 40 లక్షలు నిధులు మంజూరు కాగా రోడ్డు మరమ్మత్తులు జరుగుతున్నాయని, త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ నిధులు ఎన్నికల కోడ్ రాకముందే మంజూరు కావడంతో పనులను అప్పుడే ప్రారంభించామని తెలిపారు.

చీరాల టీడీపీ టికెట్ స్థానికులకే ఇవ్వాలి

విశాలాంధ్ర - చీరాలరూరల్ : చేనేత సామాజిక వర్గం అధికంగా ఉన్న చీరాల నియోజకవర్గాన్ని స్థానిక చేనేత వర్గానికి కేటాయించేలా తెలుగుదేశంపార్టీ అధిష్టానం పునరాలోచన చేయాలని ఆ పార్టీ యువ నాయకులు చాట్రాసి రాజేష్ అన్నారు. మండలంలోని రామకృష్ణాపురంలో సమావేశం నిర్వహించారు. అధిక సంఖ్యలో హాజరైన చేనేత సామాజికవర్గ మహిళలు, నాయకులు, యువకులతో కలిసి మాట్లాడారు. ఎన్నికలలో పోటీ చేయడానికి ఆశావహులు అందరూ ప్రయత్నిస్తారని, కానీ అధిష్టానం ఒక్కరికే అవకాశం ఇస్తుందన్నారు. అవకాశం వచ్చినప్పుడు సద్వినియోగం చేసుకుని అందరినీ కలుపుకుని వెళ్లాలని హితవు పలికారు. తమ సామాజికవర్గంపై కొండయ్య అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. ఆయన వ్యాఖ్యలకు తగురీతిలో బదులిస్తామన్నారు. గత 35 సంవత్సరాలుగా వివిధ సామాజికవర్గాలకు మద్దతు ఇచ్చి ప్రోత్సహించామని ఈసారి అవకాశం అడుగుతున్నామన్నారు. తెలుగు దేశం అధిష్టానం చీరాల నియోజకవర్గం విషయంలో పునరాలోచన చేసి స్థానిక చేనేత వర్గానికి అవకాశం ఇవ్వాలని కోరారు.

తండ్రీకుమారులకు జాతీయ బహుమతులు

విశాలాంధ్ర - వినుకొండ : ఈ నెల 23 వ తేదీన విజయవాడ స్ఫూర్తి శ్రీనివాస్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో నిర్వహించిన చిత్రకళా పోటీలలో వినుకొండ చిత్రకారుడు వజ్రగిరి జెస్టిన్ సీనియర్ చిత్రకారుల విభాగంలో తృతీయ బహుమతి లభించింది. కుమారుడు జెన్ జేసన్‌కు సబ్ జూనియర్ స్టూడెంట్స్ విభాగంలో మొదటి కన్సోలేషన్ బహుమతి లభించిందని నిర్వాహకులు స్ఫూర్తి శ్రీనివాస్ తెలిపారు. ప్రముఖ చిత్రకారులు, రాజకీయ ప్రముఖులు, కవులు, కళాకారులు, పాస్టర్లు, ఉపాధ్యాయులు, వివిధ కళాసంస్థల ప్రతినిధులు జెస్టిన్‌కు, ఆయన కుమారుడు జేసన్‌కు అభినందనలు తెలిపారు.

వార్డుల్లో సూపర్-సిక్స్ కార్యక్రమం

విశాలాంధ్ర-తాడేపల్లి : తాడేపల్లి పట్టణ పరిధిలోని 4, 5వ వార్డులో టీడీపీ తాడేపల్లి పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు ఆదేశాను సారం మంగళవారం బాబు సూపర్-సిక్స్ కార్యక్రమం నిర్వహిం చారు. పథకాలను ప్రజలకు వివరిస్తూ రానున్న ఎన్నికల్లో నారా లోకేష్‌కి గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్‌కి సైకిల్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మండవ గోపాల రావు, రాజేష్ రెడ్డి, తాడేపల్లి పట్టణ 3, 4, 5వ వార్డు అధ్యక్షులు కార్యదర్శులు ముఖ్యనాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగన్ గెలుపునకు క్రైస్తవులు కృషి

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: బడుగు బలహీన వర్గాల అభివృద్ధి అభ్యున్నతే ధ్యేయంగా ముందుకు సాగుతున్న ముఖ్యమంత్రి జగన్మో హన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసేందుకు క్రైస్తవ సమాజ మంతా ఐక్యతతో ఏకతాటిపైకి వచ్చి కృషి చేస్తుందని ఏపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధికార ప్రతినిధి డాక్టర్ పోలే ముత్యం పేర్కొన్నారు. మంగళవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ వైసీపీ అభ్యర్థుల విజయానికి క్రైస్తవులంతా కృషి చేస్తామని తెలియజేశారు. క్రైస్తవుల మనోభావాలను దెబ్బతీసే విధంగా ఓ పత్రికలో కార్టూను ప్రచురించి ఓటు బ్యాంకు రాజకీయాలు చేయడం సరికాదన్నారు. క్రిస్టి యన్ మైనార్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కే ఎం జోసఫ్, జోనల్ ఇన్చార్జి కేజే విక్టర్ పాల్, రాష్ట్ర కార్యదర్శి కె భక్త పాల్, పి జాకబ్ కుమార్, కొదమల ఎలైజా, డొక్కా సురేష్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ లావు భారీ మెజారిటీతో గెలవడం ఖాయం

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: విలువలతో కూడిన రాజకీయాతో యువతరానికి స్ఫూర్తిగా ప్రజా సేవకు అకుంఠిత దీక్ష, అంకిత భావంతో ప్రజల మనసులు గెలుచుకున్న ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు భారీ మెజారిటీతో గెలవటం ఖాయ మని గుంటూరు జిల్లా తెలుగుయువత అధ్యక్షులు రావిపాటి సాయి కృష్ణ ఆకాంక్షించారు. టీడీపీ నరసరావుపేట పార్లమెంట్ అభ్యర్థిగా ప్రకటింపబడిన సందర్భంగా పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణ దేవరాయలుని గుంటూరు పశ్చిమ టీడీపీ అభ్యర్థి గళ్ళా(పిడుగురాళ్ల) మాధవితో కలిసి సాయి కృష్ణ, తెలుగుయువత సభ్యులు మర్యాద పూర్వకంగా కలిసి రానున్న సార్వత్రిక ఎన్నికల్లో విజయాన్ని కాంక్షిస్తూ సైకిల్ గుర్తుతో కూడిన జ్ఞాపికను అందజేశారు. రాష్ట్ర తెలుగుయువత ఉపాధ్యక్షులు షేక్ ఫిరోజ్, చెరుకుపల్లి నాగరాజు, గుత్తికొండ కిరణ్, తల్లం శేఖర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ కంచుకోటకు భారీ షాక్

విశాలాంధ్ర-తర్లుపాడు : మండలంలో అజాతశత్రువుగా సుదీర్ఘకాలం నుంచి సుమారు 35 సంవత్సరాలు ఏక చక్రాధిపతిగా రాజకీయంలో తనదైన శైలిలో సముచిత మైన గుర్తింపు పొంది కాంగ్రెస్ పార్టీ అంటేనే ఆర్‌వీఆర్, ఆర్‌వీఆర్ అంటేనే కాంగ్రెస్ అని ముద్ర వేసుకున్న మాజీ సమితి ప్రెసిడెంట్, మాజీ మండల అధ్యక్షుడు రావి వెంకట్రెడ్డి. ఈయనను స్వర్గీయ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి వీరిరువురు పేర్లు పెట్టుకొని సన్నిహితంగా అన్నదమ్ములుగా సంబోధించుకునే వ్యక్తులు, నాటి నుండి నేటి వరకు వైఎస్సార్ మీద ఉన్న ప్రేమ అనురాగంతో ఇన్నేరకాల ఆటుపోటులు ఎదురైన పార్టీని వీడకుండా వారి కుటుంబం వీరాభిమానాన్ని చాటుకున్నారు. కానీ వైఎస్సార్ తనయుడు జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత పరిపాలన విధానాన్ని నచ్చక, నియోజక వర్గ కోసం అధికారం ఉన్నా లేకపోయినా అహర్నిశలు ప్రజాభివృద్ధి కోసం పోరాడుతున్న కృషీవలుడు, పశ్చిమ ప్రాంత ప్రజల ఆశాజ్యోతిగా ప్రజల హృదయాలను దోచుకున్న మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పనితీరును మెచ్చుకొని రావి వెంకటరెడ్డి తనయుడు మాజీ జెడ్పిటిసి రావి భాషాపతి రెడ్డి, మండల మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు తిప్పిరెడ్డి వెలుగొండా రెడ్డి, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాస్ రెడ్డి సోదరుడు మాగుంట సంతోష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఆధ్వర్యంలో మండల స్థాయి కార్యకర్తల ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు పసుపు కండువాలు వేసుకున్నారు. వారితోపాటు తుమ్మల చెరువు, బుడ్డపల్లి, నాగేళ్ల ముడుపు, గానుగ పంట, కేత గుడికి, తర్లు పాడు గ్రామాల నుండి సుమారు 300 కుటుంబాలు పసుపు కండువాలు కప్పుకున్నారు. ఈ సందర్భంగా ఇరువురు సంయుక్తంగా మాట్లాడుతూ రాష్ట్రంలో సరియైన పాలన లేదని, దౌర్జన్యాలు, ఆక్రమ ణలు, కక్షలు, కార్పణ్యాలతో రాష్ట్రం రావణ కాష్టంగా మారిందని ఆవేదన చెందారు. పేదవాళ్లు మరింత పేదవాలుగా మిగిలిపోయారని, ఉపాధి లేక కూలీలు ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్తున్నారని, నిరుద్యోగంతో యువత వీధుల పాలయ్యారని. దీనంతటికీ సమర్ధవంత మైన చంద్రబాబు అయితేనే రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడపగలరని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి పూర్వ వైభవం వచ్చేందుకు ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేయాలని వారు పిలుపు నిచ్చారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో తెలుగుదేశం

300 కుటుంబాలు టీడీపీలోకి వలసలు

పార్టీలో చేరిన వారిని కుటుంబ సభ్యులుగా భావించి ప్రతి ఒక్కరిని ఆదుకుంటానని మార్కాపురం నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు కందుల అన్నారు. రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి పరిపాలనలో ప్రజ లకు ఒరిగిందేమీ లేదని, అభివృద్ధి మాత్రం ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న సామెతగా రాష్ట్ర పాలన ఉంద న్నారు. రాబోయే ఎన్నికల్లో 160 సీట్లతో ఉమ్మడి సీఎంగా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావడం తథ్యమ న్నారు. ప్రతి ఒక్కరు సైనికుల్లా పనిచేసి వైఎస్ఆర్ పార్టీని భూస్థాపితం చేయాలని పిలుపునిచ్చారు. చంద్రబాబు నాయుడు వస్తేనే వెలిగొండ ప్రాజెక్టు పూర్తవుతుందని, మార్కాపురం జిల్లాగా చేస్తాడని దృఢమైన సంకల్పాన్ని ప్రజలకు తెలియపరిచారు. పశ్చిమ ప్రాంత ప్రజలకు మేలు చేయాలన్న తలంపుతోనే ఆ భగవంతుడు నన్ను మృత్యుంజయుడిగా మీ దగ్గరకు పంపారని, మీ అందరి అభిమానాలు రానున్న ఎన్నికల్లో తెలుగుదేశంపై చూపించి అఖండమైన మెజార్టీతో ఎమ్మెల్యేలను ఎంపీలను గెలి పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన మార్కా పురం నియోజకవర్గ ఇన్చార్జి ఇమ్మడి కాశీనాథ్, జిల్లా వాణిజ్య విభాగపు అధ్యక్షులు తాళ్లపల్లి ప్రసాద్, ఒంగోలు పార్లమెంటు ఉపాధ్యక్షులు కంచర్ల కాశయ్య, మండల టిడిపి కన్వీనర్ ఉడుముల చిన్నపరెడ్డి, మండల జనసేన పార్టీ అధ్యక్షుడు చేతుల శ్రీనివాసులు, బిజెపి మండల అధ్యక్షుడు గాయం లక్ష్మిరెడ్డి, తెలుగుదేశం నాయకులు కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

యువతను మత్తుకు బానిస చేస్తున్న వైసీపీ: శరత్ చంద్ర

విశాలాంధ్ర - బాపట్ల : రాష్ట్రంలోని యువతను వైసీపీ ప్రభుత్వం మత్తుకు బానిస చేస్తుందని బాపట్ల పార్లమెంట్ టి.ఎన్.ఎస్.ఎఫ్ అధ్యక్షులు మొవ్వశరత్ చంద్ర అన్నారు. మంగళవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఏర్పా టు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఫస్ట్ ఓటర్లను మత్తు పదార్థాలకు బానిసగా చేసి ఓట్లు దండుకోవాలనే వైసీపీ కుట్ర చేస్తున్నదన్నారు. రాష్ట్రంలోని అన్ని కాలేజీల్లో డ్రగ్స్ సరఫరా యథేచ్చగా జరుగుతు న్నాయన్నారు. కర్నూలు మెడికల్ కాలేజీ,ఒంగోలు రిమ్స్ కాలేజీలో మెడికల్ విద్యార్థులు పట్టపగలే గంజాయి సేవించి వీధిరౌడీల్లా దాడులు చేసుకున్నార న్నారు. గంజాయి వినియోగం ఎక్కువగా ఉన్న రాష్ట్రాల్లో ఏపీ 12వ స్థానానికి తెచ్చారన్నారు. టీడీపీ హయాంలో ఈజ్ ఆఫ్ డూయింగ్‌లో ఏపీ నెం.1 స్థానంలో ఉంటే నేడు గంజాయి అక్రమ రవాణాలో నెం.1 స్థానంలో ఉందన్నారు. గతంలో గుజరాత్ ముంద్రా పోర్టులో ఆఫ్ఘనిస్తాన్ నుంచి ఇరాన్ ద్వారా బెజవాడలోని ఆషీ ట్రేడింగ్ కంపెనీ పేరుతో రవాణా చేస్తున్న 72 వేల కోట్ల హెరాయిన్ పట్టుబడింది. నేడు బ్రెజిల్ నుంచి వైజాగ్ పోర్టుకు రూ.50వేల కోట్ల డ్రగ్స్ దొరికాయన్నారు. యువత వైసీపీ రొచ్చులో పడకుండా జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో విలువైన ఓటు ద్వారా తమ భవిష్యత్‌ను బంగారుమయంగా మార్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బాపట్ల పార్లమెంటరీ టి.ఎన్.ఎస్.ఎఫ్ నాయకులు కుర్రా ధనేంద్ర, సెక్రెటరీ గోపి, రమేష్, సాధిక్, సురజ్ తదితరులు పాల్గొన్నారు.

చీరాల బీఎస్పీ అసెంబ్లీ అభ్యర్థిగా కాటి మార్క్

విశాలాంధ్ర - చీరాల : చీరాల నియోజకవర్గ బహు జన సమాజ్ పార్టీ అసెంబ్లీ అభ్యర్థిగా కాటి మార్కును బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు బక్కా పరంజ్యోతి సోమ వారం సాయంత్రం ప్రకటిం చారు. కాటి మార్కు పోస్టల్ శాఖలో ఉద్యోగ విరమణ చేసి ఇటీవల చీరాల నియోజకవర్గ బీఎస్పీ ఇన్చార్జిగా పనిచేస్తున్నారు. ఈయన తన స్వగ్రామం రంగరావు పేట, తోటవారిపాలెంలో సౌభాగ్య సేవ సొసైటీ పేరుతో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కాటి మార్కు సేవ లను గుర్తించిన బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు బక్కా పరంజ్యోతి ఆయనకు చీరాల నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థిగా అవకాశం కల్పించారు. ఈ సందర్భంగా కాటి మార్కు మాట్లాడుతూ తనకు అవకాశం కల్పించిన పార్టీ ఆదేశాల మేరకు పోటీలో నిలిచి సత్తా చాటుతానని మాన్యశ్రీ కాన్షి రాం ఆశయాలను ప్రజలకు తెలిపి చీరాలలో అత్యధికంగా ఉన్న బహుజనులను బహుజన రాజ్యాధికారం దిశగా నడిపిస్తానని తనకు అవకాశం కల్పించిన రాష్ట్ర అధ్యక్షుడు బక్కా పరంజ్యోతికి కృతజ్ఞతలు తెలిపారు.

సకల సౌభాగ్యాలు ఇచ్చే దేవత నిదానంపాటి అమ్మవారు: మంత్రి

విశాలాంధ్ర-గుంటూరు : లోక కల్యాణం కోసం భూమిపై పార్వతీ దేవి అవతారమే నిదానంపాటి లక్ష్మీ అమ్మవారు అని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని తెలిపారు. స్థానిక నల్లచెరువు 12వ లైను ఎల్‌బీ నగర్‌లో ఉన్న శ్రీనిదానంపాటి లక్ష్మి అమ్మవారి త్రిశక్తి పీఠంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి, వైసీపీ గుంటూరు పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి విడదల రజిని మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా రజిని మాట్లాడుతూ సకల సౌభాగ్యాలు ఇచ్చే దేవత నిదానంపాటి అమ్మవారు అని పేర్కొన్నారు. 28వ డివిజన్ కార్పొరేటర్ పడాల సుబ్బారెడ్డి, మాలమహానాడు నగర అధ్యక్షుడు జేవీఎస్ నాగరాజు ఆహ్వానం మేరకు ఆలయాన్ని మంత్రి సందర్శించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులతో కొద్ది సేపు ముచ్చటించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు జె.బాలఅంకయ్య(స్వామి), ఇతర కమిటీ సభ్యులు రజినిని శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పెద్ద అంకాలు, సురేష్, రామారావు, సాయి, శ్రీనివాసులు, విఘ్నేష్, లక్ష్మణ్, వైసీపీ నాయకులు నర్సిరెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బ్యానర్లు తొలగించండి

విశాలాంధ్ర-మంగళగిరి : మంగళవారం 87 మంగళగిరి అసెంబ్లీ నియోజక వర్గ పరిధిలో ఉన్న అన్ని ప్రధాన రాజకీయ పార్టీల కేంద్రాల వద్ద నిబంధనల ప్రాప్తి, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అనుసరి ంచి జెండాలు, హోర్డింగులు, బ్యానర్లు ఉన్నాయా, నిబంధనలను ఉల్లంఘిం చారా? అన్న విషయాన్ని రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ రాజకుమారి గణియా స్వయంగా పరిశీలించారు. తదుపరి 9 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలకు తగు సూచనలు ఇచ్చి నిబంధనలకు విరుద్ధంగా ఉన్న బ్యానర్లను, హోర్డింగు లను తొలగించి ఆ ఫోటోలను స్వయంగా పంపమని సూచనలు చేశారు.

వైసీపీ గెలుపు కోసం కృషి చేస్తాం

విశాలాంధ్ర-నరసరావుపేట : పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట అసెంబ్లీ నియోజక వర్గంలో వైసీపీ నాయ కులందరూ ఐక్యంగా పార్టీ గెలుపు కోసం కృషి చేస్తున్నా మని, రానున్న ఎన్నికల్లో మూడోసారి వైసీపీ జెండా ఎగరవేస్తామని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. పట్టణంలోని డాక్టర్ గజ్జల బ్రహ్మారెడ్డి ఆసుపత్రిలో వైసీపీ అసమ్మతి నేతలు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడారు. గత ఐదు ఆరు నెలలుగా నరస రావుపేట వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుల్లో కొంత అసంతృప్తి ఏర్పడిందని, పార్టీ అధిష్టానం, ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఇటీవల అసమ్మతి నేతలను, ఎమ్మెల్యేను పార్టీ కార్యాలయానికి పిలిపించి మాట్లాడార న్నారు. ప్రస్తుతానికి అసమతిని పక్కనపెట్టి తామందరం ఐక్యంగా పనిచేసి పార్టీ గెలుపుకు కృషి చేస్తామని అసమ్మతి నాయకు లతో కలిసి ఎమ్మెల్యే ప్రకటిం చారు. అసమ్మతి నేత డాక్టర్ గజ్జల బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ తమను, తన కుమారుడు డాక్టర్ గజ్జల భార్గవ్ రెడ్డిని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పిలిపించి స్వయంగా మాట్లాడారని, పార్టీ గెలుపు కృషి చేయాలని సూచించా రని, ముఖ్యమంత్రి పిలుపు మేరకు తాము నియోజకవర్గంలో పార్టీని గెలిపిం చేందుకు కృషి చేస్తున్నామని అన్నారు.

వేసవిలో తాగునీటి ఎద్దడి రాకూడదు: కలెక్టర్

విశాలాంధ్ర - బాపట్ల : వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా అధికారులు సమగ్ర ప్రణాళిక రూపొందించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆదేశించారు. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో జల వనరులు,ప్రజల అవసరాలు, వాటి వినియోగంపై అనుబంధ శాఖల అధికారులతో స్థానిక కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో మంగళవారం ఆయన సమావేశం నిర్వహించారు. వేసవి నేపథ్యంలో తాగునీటి అవసరాల కొరకు ఏప్రియల్ 8వ తేదీన సాగర్ నీరు విడుదల కానుందని కలెక్టర్ తెలిపారు. విడుదలయ్యే నీటితో జిల్లాలోని సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులన్నింటిని నింపాలన్నారు. నీటి కొరత ఉన్నందున నీటి చౌర్యం జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సాగర్ కాల్వలకు నీరు విడుదలయ్యేలోగా అత్యవసరమైన మరమ్మతులు, లీక్‌ల నివారణ చర్యలు చేపట్టాలన్నారు. రక్షిత మంచినీటి పథకాల పనులు శరవేగంగా ముగించాలన్నారు. నాగార్జునసాగర్ కాల్వల కింద ఉన్న 131 సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులు నింపడానికి 0.443 టీఎంసీల నీరు విడుదల కానుందన్నారు. కృష్ణ పశ్చిమ డెల్టా కింద ఉన్న 52 సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులు నింపడానికి 0.16 టిఎంసిల నీరు విడుదలవుతుందన్నారు. అలాగే గుండ్లకమ్మ నది పరివాహక ప్రాంతాల లోని చెరువులు నింపడానికి 0.05 టిఎంసిల నీరు వస్తుం దన్నారు. వేసవిలో తాగునీటి ఇబ్బందులు తొలగించడానికి క్షేత్రస్థాయిలో మరింత పక్కాగా ప్రణాళిక రూపొందించి నివేదిక అందించాలన్నారు. జల వనరులు అందుబాటులో లేని గ్రామాలకు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా తాగునీరు అందించే ఏర్పాట్లు అధికారులు చేపట్టాలని కలెక్టర్ అన్నారు. ప్రస్తుతం 153 చేతిపంపులు చెడిపోయాయని వాటిని యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేయాలని ఆదే శించారు. సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులు లేని గ్రామాలలో బోర్లు వేయడానికి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పంచాయతీ నిధులు వినియోగించాలన్నారు. చెడిపోయిన బోర్లను సైతం మరమ్మతులు చేయాలని సూచించారు. ప్రస్తుతం కొల్లూరు మండలంలోనే పది మీటర్ల మేర భూగర్భ జలాలు అడుగంటాయని కలెక్టర్ చెప్పారు. బోర్లు వేయడానికి అవకాశాలు లేని ప్రాంతాలలో ట్యాంకర్ల ద్వారా నీరు తరలించడంపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు.ట్యాంకర్ల ద్వారా తాగునీరు రవాణా చేసే వాహనాలకు జిపిఎస్ యాప్ అనుసంధానిస్తామని కలెక్టర్ చెప్పారు. జిల్లాస్థాయి కమిటీలో కలెక్టర్, జిల్లా సంయుక్త కలెక్టర్, ఆర్‌డబ్ల్యూఏస్ ఎస్ఈ ఉంటారన్నారు. 750 బ్లాక్‌లుగా గుర్తించి పూర్తిస్థాయి పర్యవేక్షణ కొరకు మండల, పంచాయతీ స్థాయిలో కమిటీలు వేస్తున్నట్లు వివరించారు. మండలాల వారీగా నీటి లభ్యత, రానున్న అవసరాలపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ తెలిపారు. ప్రస్తుతం వేమూరు నియోజకవర్గంలో 159 గ్రామాలు ఉండగా,12 గ్రామాలు రక్షిత నీటి పథకంపై ఆధారపడ్డాయని మిగిలిన వాటికి బోర్లు, ఫిల్టర్ బెడ్ల ద్వారా నీరు అందుతుందన్నారు. బాపట్ల నియోజకవర్గంలో 133 గ్రామాలు ఉంటే 93 గ్రామాలు బోర్లపైన ఆధారపడ్డాయని వివరించారు. అద్దంకి నియోజకవర్గంలోని 101 గ్రామ పంచాయితీల్లోని ప్రజలకు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులు, బోర్ల ద్వారా నీరందుతుందన్నారు. పర్చూరులో 143 గ్రామపంచాయతీలలో 83 ట్యాంకులు ఉండగా మిగిలిన వాటికి సాగర్, పంట కాల్వల ద్వారా నీరు వస్తుందన్నారు. చీరాలలో 63 గ్రామాలు ఉండగా ఒక గ్రామానికి నేటి సమస్య ఉందని, మిగిలిన వాటికి చెరువులు కాలువల ద్వారా నీరందుతుందన్నారు. చేరాల పట్టణానికి మూడు నెలల వరకు నీటి సమస్య లేదన్నారు. రేపల్లెలో గ్రామాలన్నీ కాల్వల పైనే ఆధారపడినట్లు వివరించారు. ఈ సమావేశంలో ఆర్.డబ్ల్యూ.ఎస్.ఎస్.ఈ విద్యాసాగర్, జిల్లా పంచాయతీ అధికారి రవికుమార్, అనుబంధశాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పోతులను కలిసిన కరణం

విశాలాంధ్ర - చీరాల : వైసిపీ ఎమ్మెల్యే అభ్యర్థి కరణం వెంకటేష్ వైసిపీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ పోతుల సునీత, సీనియర్ నాయకులు పోతుల సురేష్‌ను చీరాలలోని వారి నివాసం వద్ద మర్యాదపూర్వకంగా మంగళవారం కలిశారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, అర్బన్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ గవిని శ్రీనివాసరావు, మునిసిపల్ వైస్ చైర్మన్ బొనిగల జైసన్‌బాబు, వైసిపి వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షులు చీమకుర్తి బాలకృష్ణ, ఇతర నాయకులు ఉన్నారు.

ర్యాలీలు, ప్రచారాలకు అనుమతులు తప్పనిసరి : కమిషనర్

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: రాజకీయ పార్టీల నాయకులు, అభ్యర్థులు ర్యాలీలు, ఇంటి ంటి ప్రచారాలు చేయాలంటే తప్పనిసరిగా 48 గంటల ముందే దరఖాస్తు చేసి, అనుమతి పొందాలని నగర కమిషనర్, తూర్పు నియోజక వర్గ రిటర్నింగ్ అధికారి (ఆర్ఓ) కీర్తి చేకూరి స్పష్టం చేశారు. మంగళ వారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో కేంద్ర ఎన్నికల సంఘం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో, పశ్చిమ నియోజకవర్గ ఆర్ఓ, అదనపు కమిషనర్ కె.రాజ్య లక్ష్మీతో కలిసి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రస్తుతం సార్వత్రిక ఎన్ని కల్లో భాగంగా వివిధ రాజకీయ పార్టీల అభ్యర్థులు తమ ప్రచార ర్యాలీలు, ఇంటింటి ప్రచారాలు చేపట్టడానికి 48 గంటల ముందే రిటర్నింగ్ అధికారి నుండి తగిన అనుమతులు పొందాలని, అందుకు తగిన విధంగా జిఎంసి ప్రధాన కార్యాలయంలో తూర్పు, పశ్చిమ నియోజక వర్గాలకు వేరువేరుగా సింగిల్ విండో కౌంటర్లు ఏర్పాటు చేశామని తెలిపారు. సభలు, సమావేశాలు, ర్యాలీలు, లౌడ్ స్పీకర్ల వినియోగం, బోర్డులు, బ్యానర్లు, తాత్కాలిక పార్టీ కార్యాలయాల ప్రారంభం తదితర అంశాలకు సంబంధించి రిటర్నింగ్ అధికారి నుండి అనుమతి పొందాలన్నారు. సమావేశంలో ఏఆర్ ఓలు ప్రదీప్ కుమార్, వెంకట లక్ష్మీ, మేనేజర్‌ప్రసాద్, సూపరిండెంట్ పద్మ పాల్గొన్నారు.

డబుల్ ఇంజన్‌లా మంగళగిరిని అభివృద్ధి చేస్తాం: లోకేష్

విశాలాంధ్ర-తాడేపల్లి : నేను, ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ డబుల్ ఇంజన్ మాదిరిగా పనిచేసి మంగళగిరి నియోజకవర్గాన్ని వేగవంతంగా అభివృద్ధి చేస్తామని యువనేత నారాలోకేష్ చెప్పా రు. ఎన్నికలప్రచారంలో భాగంగా మంగ ళగిరి నియోజకవర్గం తాడేపల్లి పైన్‌వుడ్ అపార్ట్‌మెంట్ వాసులతో యువ నేత లోకేష్ సోమవారం సమావేశమయ్యారు. లోకేష్ మాట్లాడుతూ రాబోయే 20 ఏళ్లలో మంగళగిరి ప్రజలకు అవసరమైన రోడ్లు, తాగు నీరు, అండర్ గ్రౌండ్, డ్రైనేజి, రైతుబజార్లు, శ్మశానవాటికలు తదితర మౌలిక సదుపాయల కల్పనకు అవసరమైన మాస్టర్ ప్లాన్ తమవద్ద ఉంది, గెలిపిస్తే అభివృద్ధి దిశగా మంగళగిరిని పరు గులు తీయిస్తామని చెప్పారు. చిన్నతరహా పరిశ్రమల ఏర్పాటుతో యువతకు ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. తాడేపల్లి వాసులకు తాగునీటి కోసం గత టీడీపీ ప్రభు త్వ హయాంలో పనులు ప్రారంభిస్తే జగన్‌వచ్చిన తర్వాత నిలిపివేశారు. ఎయిమ్స్‌కు కనీసం నీటిసౌకర్యం కూడా కల్పించలేని దుస్థితిలో ఉన్నారు.

'రావి' ఏ నిర్ణయం తీసుకున్న కట్టుబడి పనిచేస్తాం

విశాలాంధ్ర-పొన్నూరు : వైసీపీ ఆవిర్భావం నుంచి పార్టీకి కట్టుబడి పనిచేసిన పొన్నూరు నియోజకవర్గం మాజీ సమన్వయకర్త రావి వెంకట రమణకు సర్వేల ఆధారంగా తిరిగి ఆయనను పొన్నూరు నియోజకవర్గ అభ్యర్థిగా ప్రకటించబోతున్నారన్న సమయంలో సామాజిక సమీకరణాల పేరిట వేరొక వ్యక్తిని పొన్నూరు నియోజకవర్గ అభ్యర్థిగా పంపడంతో రావికి జరిగిన అన్యాయాన్ని జీర్ణిం చుకోలేక పోతున్నామని పొన్నూరు నియోజకవర్గ వైసీపీ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక వైసీపీ నాయకుడు తజ్మూల్ బేగ్ ఇంటి వద్ద మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వైసీపీ నాయకులు మాట్లాడుతూ వైసీపీ ఆవిర్భావం నుంచి రావివెంకటరమణ పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్తగా, గుంటూరు జిల్లా అధ్యక్షు డిగా, కృష్ణ-గుంటూరు జిల్లాల కోఆర్డినేటర్‌గా పనిచేయ డంతో పాటు పొన్నూరు నియోజకవర్గంలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన ప్రతి పిలుపును జయప్రదం చేయటంలో కీలకపాత్ర వహించగా 2014లో పొన్నూరు అభ్యర్థిగా ఓడిపోయినప్పటికీ నియో జకవర్గాన్ని అంటిపెట్టు కొని కార్యకర్తలు, నాయకులకు అండగా నిలుస్తూ పార్టీని బలోపేతం చేయడ ంతో పాటు పార్టీ పటిష్టతకు తన వంతు కృషి చేశారన్నారు.

2024 ఎన్నికల సమీపిస్తుందటతో గత రెండేళ్లుగా వస్తున్న సర్వేల ప్రకారం తిరిగి రావి వెంకటరమణకు సీటు ఇస్తే గెలుపు ఖాయమని సర్వేలు బహిర్గతం చేయగా, ఎవరికీ తెలియని, గుర్తింపు లేని వ్యక్తిని పొన్నూరు నియోజకవర్గ అభ్యర్థిగా పంపడంతో తాము ఖంగు తిన్నామ న్నారు. తామంతా రావి వెంకటరమణను కలిసి మీరు ఏ నిర్ణ యం తీసుకుంటే ఆ నిర్ణ యానికి మేమంతా కట్టుబడి పనిచేస్తామన్నారు. కార్యక్రమంలో తజ్మూల్ బేగ్, షేక్ టి.గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

అంబటి మురళి ప్రచారం

విశాలాంధ్ర-పెదకాకాని: మండల కేంద్రమైన పెదకాకానిలో మంగళ˘వారం వైఎస్సార్‌సీపీ అభ్యర్థి అంబటి మురళీకృష్ణ కాకాని శివాలయం నుంచి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. అంబటి మాట్లాడుతూ జగన్ ప్రభుత్వంలో పేదబడుగు బలహీన వర్గానికి అందరికీ సముచిత స్థానం కల్పించడం జరిగిందని, ప్రతి పేదవానికి సంక్షేమ పథకాలు అందించడం జరిగిందని కావున రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి ఓటు వేసి ప్రతి అభ్యర్థిని గెలిపించా లని కోరారు. స్థానిక వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నికల మార్గదర్శకాలను పకడ్బందీగా చేపట్టాలి

కలెక్టర్ వేణుగోపాల రెడ్డి

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: జిల్లాలో సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం అవసరమైన అన్ని ప్రక్రియలను రిటర్నింగ్ అధికారులు ప్రణాళిక ప్రకారం పకడ్బందీగా చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి ఆదేశించారు. మంగళ వారం కలెక్టరేట్‌లోని వీసీ సమావేశ మందిరంలో కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, సంయుక్త కలెక్టర్ రాజకుమారి, కమీషనర్ కీర్తి చేకూరి, తెనాలి సబ్ కలెక్టర్ ప్రఖార్ జైన్, జిల్లా రెవెన్యూ అధికారి పెద్ది రోజాతో కలసి సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు చేపట్టాల్సిన వివిధ కార్యక్రమాలపై రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు, నోడల్ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను సెక్టార్ అధికారులతో కలిసి మరోసారి రిటర్నింగ్ అధికారులు పరిశీలించి పోలింగ్ రోజు వెబ్ కాస్టింగ్, వీడియోగ్రఫీ ఏర్పాట్లపై చర్యలు తీసుకోవాలన్నారు. పోలింగ్ అధికారులకు శిక్షణ, ఈవీఎంల ర్యాండమైజేషన్, డిస్టిబ్యూషన్ కేంద్రాలకు ఈవీఎంల తరలింపు, స్ట్రాంగ్ రూంల ఏర్పాటు, కమిషనింగ్, పోలింగ్ అధికారులకు డిస్టిబ్యూషన్ కు సంబంధించి పూర్తి స్థాయి ఏర్పాట్లతో పాటు అవసరమైన సిబ్బందిని నియమించుకోవాలన్నారు. ఈవీఎంలకు సంబంధించిన విషయంలో రిటర్నింగ్ అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండి ప్రతి విషయాన్ని స్వయంగా పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం పోలింగ్ అధికారులకు, అత్యవసర సర్వీసుల ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్, హెూం ఓటింగ్ అవసరమైన ఏర్పాట్లు, సిబ్బందిని నియమించుకోవాలన్నారు. సమావే శంలో రిటర్నింగ్ అధికారులైన స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు గంగరాజు, లక్ష్మీకుమారి, అదనపు కమిషనరు లక్ష్మీ రాజ్యం, ఆర్డీవో పి శ్రీఖర్, గుంటూరు పార్లమెంట్ సహాయక రిటర్నింగ్ అధికారి భీమారావు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహిస్తాం..

విశాలాంధ్ర బ్యూరో-ఒంగోలు : ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యమని జిల్లా ఎస్పీ తెలిపారు. ఇప్పటివరకు సార్వత్రిక ఎన్నికల గురించి తీసుకున్న చర్య లను గురించి మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ ఒక ప్రకటనలో వివరించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల దృష్టిలో ఉంచుకొని జిల్లా పోలీస్ యంత్రాంగం నిష్పక్షపాతంగా, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వ హించటలో సంసిద్ధంగా ఉందన్నారు. గత ఎన్నికల్లో ముద్దాయిలుగా ఉన్న 426 మందిని ఇప్పటికే బైండోవర్ చేశారని, మిగిలిన వారిని కూడా త్వరితగతిన బైండోవర్ చెయ్యమని జిల్లాలోని పోలీస్ అధికారులను ఆదేశం చారు. ప్రస్తుతం జిల్లాలోని పోలీస్ స్టేషన్ల పరిధిలో 1031 రౌడీ షీటర్ల 887 మందిని సెక్యూరిటీ సెక్షన్ల కింద బైండోవర్ చేయగా, మిగిలిన 144 మంది రౌడీ షీటర్లపై బైండోవర్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసేందుకు రోజువారీ సమీక్షా సమావేశంలో పోలీస్ అధికారులకు ఆదేశాలిచ్చారు. ఇతర జిల్లాల నుండి ఎవరైనా క్రొత్త/అనుమానాస్పద/రౌడీ షీటర్లు జిల్లాలోకి వస్తే ఆయా జిల్లాల పోలీస్ అధికారులతో సమన్వయం చేసుకొని వారిపై కూడా పూర్తిస్థాయిలో నిఘా ఉంచడం జరుగుతుందన్నారు. బైండోవర్ షరతులను ఉల్లంఘిస్తే ఐపిసి సెక్షన్ల ప్రకారం వారిపై పోలీసులు తీసుకునే చర్యల గురించి రౌడీ షీటర్లందరికీ క్షుణ్ణంగా వివరించి కౌన్సెలింగ్ ఇవ్వడం జరిగిందన్నారు. జిల్లాలోని ఎంట్రీ/ఎగ్జిట్ పాయింట్లు, ప్రధాన జంక్షన్లలో 18 ముఖ్యమైన చెక్ పోస్టులు ఏర్పాటు చేశామని, చెక్ పోస్టుల బాధ్యతాయు తమైన ఇంచార్జ్‌ల పర్యవేక్షణలో తగినంత మంది సిబ్బందితో అక్రమ మద్యం, నగదు, మాదక ద్రవ్యాలు, విలువైన లోహాలు, ఉచిత పంపిణీ సామాగ్రి వంటి వాటిపై నిరంతర తనిఖీలు నిర్వహిస్తున్నామని, ఇప్పటి వరకు రూ:1,79,95,000, 214 గ్రాముల బంగారం, 1872 లీటర్ల అక్రమ మద్యం, 80.3 గ్రాముల మాదకద్రవ్యాలతో పాటు 40 కేజీల పాంగోలిన్ జంతువుకు చెందిన పొలుసులు (హాంక్స్ వంటి జంతువుల ఉత్పత్తి మొదలైనవి) వాహన తనిఖీల్లో స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. జిల్లాలో ప్రశాంతమైన వాతావరణంలో పారదర్శకంగా, నిష్పక్షపాతంగా మరియు సజావుగా

నియమావళి అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు: జిల్లా ఎస్పీ

ఎన్నికల నిర్వహణకు భరోసా కల్పిస్తూ ప్రజల్లో పూర్తిస్థాయిలో నమ్మకం ఏర్పరచడంలో భాగంగా కేంద్ర సాయుధ పోలీస్ బలగాలతో అన్ని సమస్యాత్మక/అతి సమస్యాత్మక గ్రామాల్లో కవాతు చేయడంతో పాటు, అన్ని స్థాయిల పోలీస్ అధికారులు సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి సందర్శించడం, గ్రామాల్లోని ప్రజానీకంతో మమేకమై అక్కడ నెలకొన్న తాజా పరిస్థితులను అధ్యయనం చేసి ఎన్నికల ప్రవర్తనా నియమావళి ప్రజలకు అవగాహన కల్పిస్తూ పోలీసులు ఇతర శాఖల అధికారులు సమావేశాలను నిర్వహించి ఎలాంటి గొడవలు, అల్లర్లు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. అన్ని రాజకీయ పార్టీలు ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహించటానికి ముందస్తు సంబంధిత శాఖల ద్వారా పర్మిషన్ తీసుకోవాలని, పర్మిషన్ లేకుండా నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఎవరైనా ఎన్నికల నియమావళిని అతిక్రమిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ హెచ్చ రించారు. ఎవరైనా ఎన్నికల నియమావళిని అతిక్రమించి నట్లు సమాచారం తెలిస్తే సి-విజిల్ యాప్ ద్వారా, (లేదా) పోలీస్ డయల్ 112 ద్వారా (లేదా) స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు.

చీరాలలో కాంగ్రెస్‌కు రంగారావే కరెక్ట్

- ప్రజామద్దతు ఉన్న నేతగా గుర్తింపు
- కొన్నేళ్లుగా పార్టీకి విశేష సేవలు

విశాలాంధ్ర - చీరాల : చీరాల నియోజకవర్గంలో దాదా పుగా అన్నీ రాజకీయ పార్టీలు రాబోయే సార్వత్రిక ఎన్నిక లలో పోటీ చేసే అభ్యర్థులను ప్రకటించింది. కానీ కాంగ్రెస్ పార్టీ మాత్రం నేటికీ ప్రకటించలేదు.. పోటీలో ఎవరు ఉంటారో ఎవరు ఉండరో తెలియని పరిస్థితి కాంగ్రెస్ పార్టీలో నెలకొంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన తరువాత రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఉనికి కోల్పోయింది. అప్పటి వరకు పార్టీలో పదవులు అనుభవించిన వారందరు పార్టీని వదలి వెళ్లారు. అదే సమయంలో దేశానికి కాంగ్రెస్ అవసరమని మొక్కవోని దీక్షతో అందరు వదిలిన కాంగ్రెస్ జెండాను తన భుజస్కందలపై ఎత్తుకొని నేటి వరకు కాంగ్రెస్ అంటే దేవరపల్లి రంగరావు, రంగరావు అంటే కాంగ్రెస్ అన్నట్లుగా జనాలలోకి కాంగ్రెస్ పార్టీని తీసుకెళ్లారు. గత పదేళ్లుగా కాంగ్రెస్ పార్టీ జెండాను మోసి బూత్ లెవెల్లో నాయ కుల నిర్మాణాన్ని చేసిన రంగరావుకు సార్వత్రిక ఎన్నికల నగారా మోగినప్పటి నుంచి ప్రస్తుతం జిల్లా నాయకులు కనీస సమాచారం లేకుండా ఇటీవల పార్టీల లోకి వచ్చిన కొందరు నాయకులతో అరకొర సమావేశాలు వేస్తున్నారు. చీరాల నియోజకవర్గంలో గత పదేళ్లుగా పార్టీ కోసం కష్టపడిన దేవరపల్లి రంగారావుకు అసెంబ్లీ టికెట్ కేటాయిస్తార లేక ఇటీవల పార్టీలోకి వచ్చిన వారికి టికెట్ కేటాయిస్తారా అని నియోజకవర్గ ప్రజలు చర్చించుకుంటు న్నారు. ప్రజలతో మమేకమైన కాంగ్రెస్ నాయకునిగా రంగరావు ఇప్పటికే గుర్తింపు పొందారు. నూతనంగా నాయకత్వం చేపట్టిన వైఎస్ తనయురాలు షర్మిల నియో జకవర్గంలో ఎవరికి అవకాశం కల్పిస్తుందో వేచి చూడాలి.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణే లక్ష్యం: ఎస్పీ

విశాలాంధ్ర - చీరాల : ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యమని, నియమావళిని అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. మంగళవారం కేంద్ర సాయుధ బలగాలు, జిల్లా పోలీసులు సంయుక్తంగా జిల్లా చీరాల రూరల్ సర్కిల్ పరిధిలోని రామాపురం,కటారివారిపాలెం గ్రామాలలో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికలలో ఎటువంటి శాంతి భద్రత సమస్యలు తలెత్తకుండా ప్రశాం త వాతావరణంలో జరగాలనే ఉద్దేశంతో రామాపురం, కటారివారిపాలెం గ్రామాలలో కేంద్ర సాయుధ బలగాలు, జిల్లాలోని పోలీసులు సంయుక్తంగా కవాతు నిర్వహించా యన్నారు. రాబోయే ఎన్నికలు ప్రశాంతంగా ముగిసే వరకు కేంద్ర బలగాలు జిల్లాలోనే ఉంటాయని, ఏదైనా గ్రామంలో గాని, ప్రదేశంలో గానీ గొడవలు,శాంతి భద్రత సమస్యలు తలెత్తినప్పుడు ఆ ప్రదేశాలలో ప్రశాంతమైన వాతావరణం నెలకొల్పడానికి పోలీస్ శాఖతో పాటు కేంద్ర సాయుధ బలగాలు కూడా విధులు నిర్వహిస్తాయన్నారు. ఎక్కడైతే శాంతిభద్రతల సమస్యలు తలెత్తే అవకాశం ఉంటుందో, లేదా గతంలో ఏవైనా గొడవలు జరిగి ఉంటే అటువంటి గ్రామాలలో సాయుధ బలగాలతో కవాతు నిర్వహిస్తున్నామన్నారు. రామాపురం,కటారివారిపాలెం గ్రామాలలో కవాతు నిర్వహించారని, పైగ్రామాలలో గత సంవత్సరం గొడవలు జరిగాయని, వాటిపై కేసులు నమోదు చేసి సంబంధిత వ్యక్తులను అరెస్టు కూడా చేశారని అన్నారు. గతంలో జరిగిన గొడవలను మనసులో పెట్టుకొని మరల ఎవరైనా గొడవలకి పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రానున్న రోజులలో ఎవరు కూడా గొడవలు పడకుండా ఎన్నికలు జరిగేందుకు సహకరించాలని, ఎవరైనా ఎన్నికల నియమావళిని అతిక్రమిస్తే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏటువంటి ప్రలోభాలకు గురికాకుండా ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బిఎస్ఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ బ్రిజ్ కిషోర్ నేగి, చీరాల డిఎస్పి బి.ప్రసాదరావు, బిఎస్ఎఫ్ సిబ్బంది, స్థానిక పోలీస్ సిబ్బంది,అధికారులు రామాపురం, కటారివారి పాలెం గ్రామ ప్రజలు,పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

కోన ఎన్నికల ప్రచారంలో కోన వెంకట్

విశాలాంధ్ర - కర్లపాలెం : మండలంలోని దమ్మనవారిపాలెం, బోలాయపాలెం గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ అసెంబ్లీ అభ్యర్థి కోన రఘుపతి తరపున ప్రముఖ సినీ రచయిత, నిర్మాత కోన వెంకట్ ఇంటింటికి ప్రచార కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ప్రతి ఇంటికి తిరుగుతూ ఫ్యాను గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కరపత్రం అందజేసి అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ యారం వనజ, మండల కన్వీనర్ యల్లావుల ఏడుకొండలు, మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ దొంతిబోయిన సీతారామి రెడ్డి, మండల ఉపాధ్యక్షులు సుబ్బారావు, ఎంపీటీసీ ఆసిఫ్ ఆలీ, అమీర్ బేగ్, అక్కల శ్రీనివాస రెడ్డి, నాగేశ్వర్ రెడ్డి, నాగరాజు, పెద్ద శ్రీనివాసరెడ్డి, బెనర్జీ మండల వైసీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పక్కాగా అమలు చేయాలి

విశాలాంధ్ర-కనిగిరి : గ్రామాల్లో ఎన్నికల నిబంధనలు పక్కాగా అమలు చేయాలని ఆర్డీవో పాలపర్తి జాన్ ఇర్విన్ అన్నారు. మంగళవారం గ్రామ సచివాలయ మహిళా పోలీసులకు ఎన్నికల నిబంధనలపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో రాజకీయ పార్టీల విగ్రహాలకు ముసుగులు వేయాలని, నాయకుల చిత్రాలు కనిపించకుండా జాగ్రత్తలు పాటించా లన్నారు. గ్రామాల్లో ప్రచారం చేసే రాజకీయ పార్టీల నాయకులు కచ్చితంగా అనుమతులు పాటించాలన్నారు. వందకు వంద శాతం గ్రామాల్లో పక్కాగా అమలు చేస్తే ఏటువంటి సమస్యలు రావన్నారు. రాజకీయ ప్రచార వాహనాలకు ఉచితంగా 48 గంటల ముందే అనుమతి పొందేలా సువిధ యాప్లో చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సురేష్ కుమార్, కిషోర్ రెడ్డి పాల్గొన్నారు.

తువ్వపాడులో ఉచిత వైద్య శిబిరం

విశాలాంధ్ర-కొనకనమిట్ల : మండలంలోని తువ్వపాడు పంచాయతీలో మంగళవారం వైద్యాధికారి ఎస్పీ బాలయ్య ఆధ్వర్యంలో ఆరోగ్య సురక్ష ఉచిత వైద్య శిబిరం నిర్వహిం చారు. డాక్టర్ సయ్యద్ అబ్దుల్ వజిత్, కంటి డాక్టర్ పివి ప్రసాద్ 304 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. వారిలో 34 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి ఎస్పీ బాలయ్య మాట్లాడుతూ వైద్య శిబిరాలు ద్వారా అందరికీ ఉచితంగా వైద్య సేవలు అందిస్తారని ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పిహెచ్ఎన్ శైలజహెల్త్ సూపర్వైజర్ టీ ప్రతాపరెడ్డి హెచ్‌వి శ్యామలాదేవి, ఏఎన్ఎంలు ఆశా కార్యకర్తలు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

స్వేచ్ఛగా ఓటు వినియోగించుకోవాలి

విశాలాంధ్ర - యద్దనపూడి : ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ నాగ రాజు అన్నారు. మండలంలోని యద్దనపూడి గ్రామంలో ఓటు హక్కుపై గ్రామంలో తహశీల్దార్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. 18 సంవత్సరాల నిండిన ప్రతి పౌరుడు తమ ఓట్లను నమోదు చేసుకొని రాబోయే ఎన్నికల్లో సద్వినియోగం చేసుకో వాలన్నారు. అనంతరం పంచాయతీ కార్యాలయం వద్ద ప్రజ లకు అవగాహన కల్పించారు. డిప్యూటీ తహశీల్దార్ విష్ణు, బీఎల్‌వోలు, కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

వీఆర్వో జయ ప్రకాష్ మృతి

విశాలాంధ్ర-దర్శి : తూర్పు వీరాయపాలెం వీఆర్వో దేసు జయప్రకాష్ మంగళవారం గుండెపోటుతో మృతి చెందారు. ఈయన స్వగ్రామం బొట్లపాలెం కాగా దర్శిలో నివాసం ఉంటున్నారు. గత రెండు రోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఒంగోలులోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేరారు. వైద్య సేవలు అందుతున్నప్పటికీ అవయవాలు స్పందించకపోవడంతో మృతి చెందినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు. ఈయనకు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. జయప్రకాశ్ తండ్రి దేశ బాల గురునాథం వీఆర్వో పని చేస్తూ మృతి చెందడంతో కారుణ్య నియామకాల్లో జయప్రకాష్ విధుల్లో చేరారు. కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. రెవెన్యూ అధికారులు పరామర్శించి నివాళులర్పించారు.